teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 140 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 15 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయంపై ట్రాన్స్ జెండర్స్ హర్షం



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్ జెండర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇన్ని రోజులూ తమను చీదరించుకున్న సమాజం ఇక నుంచైనా తమను స్వాగతిస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ట్రాఫిక్ నియంత్రణలో తమ వంతు కృషి అందిస్తామని చెప్పుకొచ్చారు. ఆసక్తిగా ఉన్నవారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారని తెలిపిన ట్రాన్స్ జెండర్లు ఇదే సందర్భంగా ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి తమ కోరికల చిట్టాను వినిపించారు.



# వణికిస్తున్న దోమ కాటు జ్వరాలు



**పల్లెల్లో.. పట్టణాల్లో "ప్రతీ ఇంటా" ప్రభావం**

**అనారోగ్య పరిస్థితులపై సర్కార్ సర్వ ప్రయత్నాలు**

**కిక్కిరిసిపోతున్న ధావఖానాలు**

తెలంగాణ, సెప్టెంబరు 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అనేక జిల్లాల్లో వివిధ రకాల జ్వరాలు నమోదవుతుండడంతో పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా జ్వరం సంబంధిత కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల ఈ అనారోగ్యాల వ్యాప్తిని నిర్వహించడానికి మరియు నియంత్రించడానికి

మిగతా 2 లో

# పార్టీ మారిన నాయకులకు తాటికొండ రాజయ్య సవాల్

**రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై గెలవండి..**


**అభివృద్ధికై పార్టీ మారానన్న కడియం చేసింది గుండు సున్నా**

**కడియం శ్రీహరిపై విమర్శలతో విరుచుపడ్డ తాటికొండ**



తెలంగాణలో రాక్షస పాలన నడుస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొంద రాజయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదు, ప్రజలను పీడించే.. హింసించే పాలన అంటూ ఘాటు విమర్శలు చేశారు. పార్టీ మారిన నేతలకు దమ్ముంటే వెంటనే రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసి గెలవాలని డిమాండ్ చేశారు.

జనగామ, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): కాగా, స్టేషన్ ఘనపూర్‌లో శనివారం అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రాజయ్య పాల్గొన్నారు. అనంతరం, ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ గూండాలను




# డిగ్రీ చదువుతున్న వారికి ఆర్‌బీఐ 90 క్విజ్

**లక్షాధికారి కావడానికి ఆర్‌బీఐ యువతకు సువర్ణావకాశం**

**ప్రారంభమైన క్విజ్ కి సంబందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ఆర్‌బీఐ 90వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఏదేని డిగ్రీ చదువుతున్న వారికి ఆర్‌బీఐ 90 క్విజ్ పేరిట పోటీలు నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో లక్షాధికారి కావడానికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్

మిగతా 2 లో

# గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు

**అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు**



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. పైలెట్

మిగతా 2 లో



## ఈనెల 20న సమావేశంకానున్న తెలంగాణ కేబినెట్

**రాష్ట్రం అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం**

**ప్రధానంగా రేషన్ కార్డుల విధానాలు ఖరారుకు యోచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈనెల 20న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం సెప్టెంబర్ 20న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో జరగనుంది. కొద్ది రోజులుగా

మిగతా 2 లో



## అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్‌రెడ్డి పాలన

**సీఎం రేవంత్ రెడ్డిపై కెసిఆర్, కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెచ్చిపోయారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన నడుస్తోందని విమర్శించారు. అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగొచ్చిన కేటీఆర్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై ఘాటైన

మిగతా 2 లో

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ రాబోతుంది

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వాఖ్యలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ లోపు ఆర్డినెన్స్ రాబోతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన విషయాన్ని వెల్లడించారు. చాలా మంది హైడ్రాపై అనేక అనుమానాలు లేవనెత్తున్నారని, కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారని అలాంటి వారికి త్వరలోనే

మిగతా 2 లో

## ఈనెల 16 నుండి రామగుండంకు వందే భారత్ ట్రైన్

**ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే అధికారుల సూచన**

.. వివరాలు 2లో

## దేశ ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర చాలా గొప్పది

**రహదారులు, వంతెనలు నిర్మించి ప్రగతిని పరుగులు పెట్టించారు**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): దేశ ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర చాలా గొప్పదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆనకట్టలు, రహదారులు, వంతెనలు

మిగతా 2 లో



## రాష్ట్రంలో మళ్ళీ వర్షాలు

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక అప్డేట్**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో వర్షాలపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక అప్డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్

మిగతా 2 లో

## సెప్టెంబర్ 17, 18 తేదీల్లో మందు బంద్

**ఈ మేరకు పోలీసులు ఉత్తర్వులు జారీ**

**గణేష్ నిమజ్జనం వేళ పోలీసుల నియమాలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): సెప్టెంబర్ 17, 18 తేదీల్లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని అన్ని వైన్స్, బార్, కల్లు కాంపౌడ్లు మూసివేయనున్నారు. హైదరాబాద్ పోలీసులు ఈ మేరకు ఉత్తర్వులు

మిగతా 2 లో

## పార్టీ మారిన నాయకులకు తాటికొండ రాజయ్య సవాల్

మొదటి పేజీ తరువాయి

ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నాడు. కౌశిక్ రెడ్డిని గృహ నిర్బంధం చేసి ప్రభుత్వం పక్షపాత ధోరణిని అవలంభించింది. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం. దాడి చేసిన గుండాలను అరెస్టు చేసి, చర్యలు తీసుకోవాలి. మాజీ మంత్రి అని కూడా చూడకుండా హరీష్ రావును తీసుకెళ్లడం దారుణం. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన శాంతియుతంగా జరిగింది. కాంగ్రెస్ ది ప్రజాపాలన కాదు, ప్రజలను హింసించే పాలన. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ క్షీణించిపోయింది. 1985లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ పార్టీ ఫిరాయింపుల చట్టం తీసుకువచ్చారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని మొన్న ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా చేర్చారు. పార్టీ ఫిరాయించిన వారిని రాళ్లతో, కోడి గుడ్లతో కొట్టండని రేవంత్ రెడ్డే చెప్పారు. నాడు తెలంగాణ ఆకాంక్ష కొరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచాను. నైతిక విలువలు, అభివృద్ధి అంటున్న కడియం శ్రీహరి ముందు రాజీనామా చేయాలి. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా హైకోర్టు బెంచ్, సుప్రీం కోర్టుకు వెళ్తా అనడం సిగ్గుచేటు. దమ్ముంటే రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై గెలవాలి. జనరల్ డిగ్రీ కాలేజ్ తీసుకొస్తానని అనేక సార్లు చెప్పిన కడియం దీనిపై ఇప్పటి వరకు అతీగతీ లేదు. అభివృద్ధి కోసం పార్టీ మారిన కడియం స్టేషన్ ఘనపూర్‌కు చేసింది గుండు సున్నా. బీఆర్ఎస్ తెచ్చిన రైతుబంధును రైతుభరోసాగా మార్చారు. రైతుభరోసా లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు' అంటూ కామెంట్స్ చేశారు.

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ రాబోతుంది

మొదటి పేజీ తరువాయి

సమాధానం దొరుకుతుందని రంగనాథ్ చెప్పుకొచ్చారు. తెలంగాణ క్యాబినెట్ ఆమోదంతో హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ ఆర్డినెన్స్ రాబోతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సమావేశంలో కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.." తెలంగాణ ప్రభుత్వం జులై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. హైడ్రాకు చట్టబద్ధత ఉందా, లేదా? అని ఇవాళ కొంతమంది ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొంత మంది న్యాయస్థానాలకు సైతం వెళ్లారు. హైడ్రా చట్టబద్ధమైనదే. ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారా దీన్ని ఏర్పాటు చేశారు. ప్లానింగ్ కమిషన్, క్యాబినెట్ సెక్రటేరియెట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటివి ఎన్నో ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారానే ఏర్పాటయ్యాయి. అక్టోబర్ లోపు హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాబోతుంది. హైడ్రాను చట్టబద్ధం చేసేందుకు తెలంగాణ సర్కార్ పని చేస్తుంది. త్వరలో క్యాబినెట్ ఆమోదంతో దీనికి విశేషాధికారాలు రానున్నాయి. వాల్టా, మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల చట్టాల్లోని విశేషాధికారాలు సైతం హైడ్రాకు వస్తాయి. ఆరు వారాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో హైడ్రా బిల్లు తీసుకురాబోతుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు హైడ్రా సహకారంగా ఉంటుంది. గ్రే హౌండ్స్, టాస్క్ ఫోర్స్ తరహాలోనే హైడ్రా పని చేస్తుంది" అని చెప్పారు.

## అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్‌రెడ్డి పాలన

మొదటి పేజీ తరువాయి

పదజాలంతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని మోసం చేసిన ఘన రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేక రేవంత్ తొత్తులు చిల్లర ఎత్తుగడలు వేస్తున్నారని మండిపడ్డారు. సీఎం స్వయంగా ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేసుకుని హైకోర్టు తీర్పు తరువాత స్వరం మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో తొమ్మిది నెలలుగా ఒక వైపు హెడ్ లైన్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారని మరోవైపు డెడ్‌లైన్‌లను దాటవేస్తూ గారడి మాటలు చెబుతున్నారని రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

## ఈనెల 16 నుండి రామగుండంకు వందే భారత్ ట్రైన్

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): వందేభారత్‌ట్రైన్‌సేవలు ఈ నెల 16 నుంచి రామగుండం ప్రాంత ప్రయాణికులకు అందనున్నాయి. నాగ్‌పూర్‌లో ఉదయం ఐదు గంటలకు బయలు దేరే ఈ ట్రైన్ సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లర్షా తర్వాత రామగుండంకు ఉదయం 9.08 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం ఒంటిగంటకు సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ ట్రైన్ రామగుండంకు మధ్యాహ్నం 3.30 గంటలకు, చివరి స్టేషన్‌నాగ్‌పూర్‌కు రాత్రి 8.20 గంటలకు చేరుతుంది. ఈ వందేభారత్ ట్రైన్ మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు నడుస్తుంది. నాగ్‌పూర్ నుంచి రామగుండంకు నాలుగు గంటలు, రామగుండం నుంచి సికింద్రాబాద్‌కు రెండు గంటల 13 నిమిషాలలో చేరుకోవచ్చని, ఈ సౌకర్యాన్ని ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే డీఆర్‌యూసీసీ మాజీ మెంబర్ క్యాతం వెంకటరమణ కోరారు.

## దేశ ప్రగతిలో ఇంజినీర్ల పాత్ర చాలా గొప్పది

మొదటి పేజీ తరువాయి

నిర్మించి దేశ ప్రగతిని పరుగులు పెట్టించారని తెలిపారు. తమ వృత్తికి వన్నె తెచ్చే విధంగా ఇంజినీర్లు(Engineers) పనిచేయాలని కోరారు. ఇంజినీర్లకు వాహన సదుపాయం, పెండింగ్లో ఉన్న డిఏపిఆర్సి, పదోన్నతులు వంటి అంశాలను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్‌లో శనివారం జరిగిన పంచాయతీరాజ్ డిప్లమా ఇంజినీర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. దేశ మొట్టమొదటి సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా ఇంజినీర్లు అంతా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ దేశ అభివృద్ధిలో ఇంజినీర్లు పోషించిన పాత్రను వివరించారు. ఎన్నో ఆనకట్టలకు కూలీలతో పాటు ఇంజినీర్లు కూడా రాళ్ళేతారని, వారి కృషి ఫలితంగానే ఆహార సంక్షోభం వంటి ఎన్నో సంక్షోభాలను ఈ దేశం అధిగమించగలిగిందని చెప్పారు. మరి ముఖ్యంగా సివిల్ ఇంజినీర్లు లేకపోతే మనదేశంలో ఈ స్థాయి అభివృద్ధి జరిగేది కాదని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలను పెంచేలా ఇంజినీర్లు పనిచేయాలన్నారు. ఒకప్పుడు 20 ఏండ్ల పాటు భద్రంగా ఉండే సిసి రోడ్లు, ఇప్పుడు చిన్నపాటి వర్షానికే దెబ్బ తినడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణం, నిర్వహణలో సివిల్ ఇంజినీర్లు కాంట్రాక్టర్లతో కఠినంగా వ్యవహరించాలని కోరారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలని చెప్పారు. వర్షాలు వరదల నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులను మెరుగుపరిచే విషయంలో ఇంజినీర్లంతా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా ఇంజినీర్లు అంతా జాతి నిర్మాణానికి పునర్ అంకితం కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నం, ఇతర ఉన్నతాధికారులు, పంచాయతీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మళ్ళీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందన్నారు. అయితే అది ఏపీ తీరంలో కాదు. బంగ్లాదేశ్‌కి ఆగ్నేయ దిశలో అది కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. ఈ వాయుగుండం వాయవ్య దిశగా కదులుతోందని దీని ప్రభావంతో బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో వర్షాలు కురుస్తున్నాయన్నారు. దీని కారణంగానే ఏపీ, తెలంగాణల్లో ఈ వారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని జిల్లాల్లో కురుసే ఛాన్స్ ఉందన్నారు.

# వణికిస్తున్న దోమ కాటు జ్వరాలు

మొదటి పేజీ తరువాయి

తక్షణ చర్యలు తీసుకోనుటలో ఆరోగ్య అధికారులు, శాఖ సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

**ప్రభావం చూపుతున్న జ్వరాలు**

1. వైరల్ ఫీవర్స్ అత్యంత సాధారణ రకం జ్వరం వైరల్ జ్వరం, ఇది అధిక ఉష్ణోగ్రతలు, శరీర నొప్పులు మరియు అలసటతో ఉంటుంది. ఈ జ్వరాలు సాధారణంగా వివిధ రకాల వైరస్‌ల వల్ల సంభవిస్తాయి మరియు చాలా అంటువ్యాధిగా ఉంటాయి.
2. డెంగ్యూ జ్వరం ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో డెంగ్యూ కేసులు కూడా బాగా పెరిగాయి. అధిక జ్వరం, విపరీతమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కీళ్ల మరియు కండరాల నొప్పి, దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటాయి.
3. చికున్‌గున్యా దోమల వల్ల వచ్చే మరో వ్యాధి చికున్‌గున్యా పెరుగుతోంది. ఇది అధిక జ్వరం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, కండరాల నొప్పి, తలనొప్పి, వికారం, అలసట మరియు దద్దురులతో ఉంటుంది.
4. అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌లు (URIలు) తరచుగా వైరస్‌ల వల్ల వచ్చే ఈ ఇన్‌ఫెక్షన్లు దగ్గు, గొంతు నొప్పి మరియు నాసికా రద్దీ వంటి లక్షణాలతో కూడిన జ్వరాలకు దారితీస్తున్నాయి.

**అధిక ప్రభావ ప్రాంతాలు**

హైదరాబాద్ డెంగ్యూ మరియు వైరల్ ఫీవర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరగడంతో రాజధాని నగరం ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఫీవర్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వంటి ఆసుపత్రుల్లో రోగుల రద్దీ కొనసాగుతోంది. ఔట్ పేషెంట్ విభాగాలు (OPDలు) ప్రతిరోజూ 1,500 నుండి 2,000 మంది రోగులను చూస్తున్నాయి, గణనీయ సంఖ్యలో





జ్వరం లక్షణాలతో ఉన్నారు.

కామారెడ్డి జిల్లా ఈ జిల్లాలో వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయని నివేదించింది. సదాశివనగర్ మండలం భూంపల్లె గ్రామంలో ఇటీవల వైరల్ ఫీవర్‌తో ఇద్దరు చిన్నారులు చనిపోయారు. జిల్లాలో గత ఎనిమిది నెలల్లో 110కి పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి.

రంగారెడ్డి మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు ఈ ప్రాంతాల్లో కూడా అత్యధిక సంఖ్యలో డెంగ్యూ కేసులు నమోదయ్యాయి, ఇటీవలి నెలల్లో వరుసగా 310 మరియు 399 కేసులు నమోదయ్యాయి.

**ఆరోగ్య శాఖ స్పందన**

తెలంగాణలో ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంది మరియు పరిస్థితిని అధిగమించడానికి అనేక చర్యలు చేపడుతున్నది. పెరిగిన నిఘా వ్యాప్తిని ట్రాక్ చేయడానికి మరియు హాట్‌స్పాట్‌లను గుర్తించడానికి జ్వరాల కేసుల పర్యవేక్షణ మరియు నివేదించడం ముమ్మరం చేయబడింది.

ప్రజా అవగాహన ప్రచారాలు పరిశుభ్రత పాటించడం, దోమల నివారణ మందుల వాడకం, నీరు నిలిచిపోకుండా నివారించడం వంటి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు.

మెడికల్ సపోర్ట్ ప్రభుత్వ ఆసుపత్రులు రోగుల పెరుగుదలను నిర్వహించడానికి సన్నద్ధమయ్యాయి, పెరిగిన భారాన్ని నిర్వహించడానికి అదనపు సిబ్బంది మరియు వనరులను కేటాయించారు.

**నివారణ చర్యలు**

ఈ జ్వరాల వ్యాప్తిని ఎదుర్కోవడానికి, ఆరోగ్య శాఖ దీని ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. పరిశుభ్రత క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం. దోమల నియంత్రణ దోమతెరలు, వికర్షకాలు ఉపయోగించడం మరియు సంతానోత్పత్తి ప్రదేశాలను తొలగించడం.

జ్వరం, కీళ్ల నొప్పులు లేదా దద్దుర్లు కనిపించినట్లయితే వెంటనే వైద్య సంరక్షణ కోరడం తప్పనిసరి. తెలంగాణలో పిల్లల్లో జ్వరాల కేసులు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది, దీనికి ఆరోగ్య అధికారులు, తల్లిదండ్రులు మరియు సమాజం నుండి సమన్వయ కృషి అవసరం. అప్రమత్తంగా ఉండటం మరియు నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా, ఈ వ్యాధుల ప్రభావాన్ని తగ్గించడం మరియు యువ జనాభా శ్రేయస్సును నిర్ధారించడం సాధ్యమవుతుంది.

## డిగ్రీ చదువుతున్న వారికి ఆర్‌బీఐ ఆధ్వర్యంలో "90" క్విజ్

మొదటి పేజీ తరువాయి

ఇండియా (ఆర్‌బీఐ) యువతకు సువర్ణావకాశం కల్పిస్తోంది. కాగా ఇప్పటికే ఈ క్విజ్ కి సంబందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. క్విజ్ లో పాల్గొనడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈనెల 17వ తేదీ వరకు అవకాశం ఉంది. ఈనెల 19 నుంచి 21వ తేదీ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు నిర్వహిస్తారు.

**క్విజ్ లో పాల్గొనుటకు అర్హత**

2024 సెప్టెంబర్ 1 నాటికి 25 ఏళ్లలోపు ఉండి ఏదైనా డిగ్రీ చదివి ఉండాలి. %షుషు.తీఎఱ90నబఱఓ.ఱఅ% లో పేరు,గుర్తింపు కార్డు నంబరు వంటివి నమోదు చేయాలి. ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఒక కాలేజీ నుంచి ఎంత మందైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

**నాలుగు దశల్లో క్విజ్ పోటీలు**

పోటీలు జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిల్లో ఉంటాయి. బృందానికి కనీసం ఇద్దరు ఉండాలి. తొలుత జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో 36 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. వీటికి 15 నిమిషాల సమయం ఉంటుంది. అంధులకు అదనంగా మరో 15 నిమిషాలు ఇస్తారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన 90 బృందాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన బృందాలను జోనల్‌గా విభజించి అనంతరం జాతీయ స్థాయికి ఎంపిక చేసి పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు గెలుచుకునే అవకాశం ఉంటుంది. ఆంగ్లం, హిందీ భాషల్లో పోటీలు ఉంటాయి. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక వ్యవస్థ, తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి.

**వసతి,రవాణా ఖర్చులు**

జిల్లా స్థాయి పోటీలు మాత్రమే ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఆ తర్వాత జరిగే రాష్ట్ర, జోనల్, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులకు రవాణా, వసతి ఖర్చులను ఆర్‌బీఐ భరిస్తుంది. విద్యార్థి వెంట ఒక అధ్యాపకుడు వెళ్లడానికి అయ్యే వ్యయాన్ని సైతం ఆర్‌బీఐ చూసుకుంటుంది. రిజిస్ట్రేషన్ సమయంలో అందజేసిన వివరాలు తప్పుగా తేలితే అనర్హులుగా నిర్ణయిస్తారు.

## ఈనెల 20న సమావేశంకానున్న తెలంగాణ కేబినెట్

మొదటి పేజీ తరువాయి

పెండింగ్‌లో ఉన్న పలు కీలక అంశాలపై రాష్ట్ర మంత్రి మండలి కీలక నిర్ణయం తీసుకోనుంది. ప్రధానంగా రేషన్ కార్డులకు సంబంధించిన విధానాలు ఖరారు చేయాలని కేబినెట్ యోచిస్తోంది. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీలో పారదర్శకతను పెంచడానికి మార్పులు చేర్పులు చేయాలన్న ఆలోచనతో కేబినెట్ నిర్ణయం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులు పొందే అర్హతలపై సవరణలు చేసి, ప్రజలకు మరింత సౌలభ్యంగా అందజేయాలనే ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇక, హెల్త్ కార్డుల విషయంలో కూడా మంత్రి మండలి చర్చించనుంది. సాధారణ ప్రజలకు ఆరోగ్య సేవల విస్తరణను సులభతరం చేయడానికి ఆరోగ్య కార్డుల పంపిణీపై రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోనుంది.

### వరదలపై కేంద్ర సాయం కోసం తీర్మానం

ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలను దెబ్బతీశాయి. ఆ వరదల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి, సహాయం కోరుతూ తీర్మానం చేసి పంపాలని కేబినెట్ యోచిస్తోంది. ఈ వరదలు పంటలను, దెబ్బతీసి ప్రజలకు తీవ్ర నష్టం కలిగించాయి. దీంతో కేబినెట్ తీర్మానం చేసి పంపాలని యోచిస్తున్నారు. ఈ సమావేశం ద్వారా పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోబోతోంది రాష్ట్ర కేబినెట్.

## తెలంగాణ "రోడ్లపై" బ్లాక్ స్పాట్లను గుర్తించిన ఎన్హెచ్ఏఐ

### రాష్ట్రవ్యాప్తంగా 336 స్పాట్లను గుర్తించినట్లు సమాచారం

### నిర్మూలనకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అడుగులు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రోడ్లపై చాలా కాలంగా ఉన్న బ్లాక్ స్పాట్లను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) ఐడెంటిఫై చేసింది. వాటి నిర్మూలనకు కూడా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ (NH) అడుగులు వేస్తున్నది. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రోడ్లపై దాదాపు 336 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిసింది. అయితే, గత మూడు సంవత్సరాల్లో 'నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా' పరిధిలో ఉండే జాతీయ రహదారులపై ఉన్న 3,996 బ్లాక్‌స్పాట్‌లపై 57,329 ప్రమాదాల జరిగితే 28,765 మంది మృత్యువాతపడ్డారని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలోని జాతీయ రహదారులపై 336 బ్లాక్‌స్పాట్‌లతో తెలంగాణ ఐదో స్థానంలో ఉంది. అయితే, ఈ బ్లాక్‌స్పాట్‌ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకొని వాటిని రూపుమాపేందుకు NHAI చర్యలు ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు కలిసి రూ. 7,500 కోట్లు ఖర్చు చేసి... ఆ ప్రదేశాలను ప్రమాద రహితంగా మార్చాలని ప్రణాళికలు రచిస్తోంది. ఈ ఏడాది మధ్యలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో బ్లాక్‌స్పాట్‌లపై పనులు మొదలు పెట్టాలని యోచిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆ పనులకు సంబంధించిన డ్రాఫ్టును సైతం NHAI సిద్ధం చేసిందని తెలిసింది. ఈ అంశంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పని చేస్తాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తెలంగాణలో చేవెళ్ల, వికారాబాద్, పరిగి గుండా వెళ్ళే ఎన్ హెచ్-163పై అత్యధికంగా 38 బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రాష్ట్రంలో నేషనల్ హైవేల నిడివి 3,174 కిలోమీటర్లు ఉండగా 25 జాతీయ రహదారుల్లో మొత్తం 342 బ్లాక్‌స్పాట్‌లు ఉన్నాయని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(NHAI) అధికారులు వెల్లడించారు. మిగతా ఎన్‌హెచ్ లపై కూడా పదుల సంఖ్యలోనే బ్లాక్‌స్పాట్‌లు ఉన్నాయని చెబుతున్నారు. ఈ బ్లాక్‌స్పాట్ల సమీప ప్రాంతంలో హెచ్చరికలు ఏర్పాటు చేయాలని ఎన్ హెచ్ ఏఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బ్లాక్‌స్పాట్ వద్ద రోడ్డుకు రెండు వైపుల భద్రతాతో కూడిన బోర్డులు, హెచ్చరిక బోర్డులు పెట్టనున్నారు. దీంతోపాటు, అవసరమైన చోట గ్రేడ్ సెపరేటర్స్ నిర్మాణం, రోడ్డు వెడల్పుల వంటివి కూడా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా యోచిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే దానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ఉపరితల, రోడ్డు రవాణా శాఖ డ్రాఫ్టు కూడా తయారు చేసిందని సమాచారం. దేశవ్యాప్తంగా మొత్తం ఈ పనుల కోసం ఖర్చు చేసే రూ. 7,500 కోట్లలో తెలంగాణ రాష్ట్రానికి దాదాపు రూ. 680 కోట్లు వరకు వస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళికలు

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్ట్ కింద కొన్ని గ్రామాలను ఎంపిక చేయాలన్నారు. పవర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా వచ్చే విద్యుత్‌ను పవర్ గ్రిడ్‌కు కనెక్ట్ చేయాలన్నారు. మింట్ కాంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ ఆఫీస్‌లో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, వివిధ వర్గాలకు ఆదాయం సమకూర్చడంపై అధికారులతో భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఏటా సోలార్ పవర్ ద్వారా రైతులకు నిర్ధిష్టంగా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇండ్లకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఖర్చుతో సోలార్ పవర్ సెట్‌లను ఏర్పాటు చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు మధిర నియోజకవర్గంలోని సిరిపురంతో సహా రాష్ట్ర వ్యాప్తంగా 20 గ్రామాలను ఎంపిక చేయాలి అని భట్టి అన్నారు.

**బై బ్యాక్ పద్ధతిలో కొనుగోలు**

ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలకు ఐదు నుంచి పది మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పెట్టుకోవడానికి ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వయం సహాయక గ్రూప్ సభ్యులకు బ్యాంకు నుంచి లోన్లు ఇప్పించాలి. సోలార్ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే కరెంట్‌ను ప్రభుత్వమే బై బ్యాక్ పద్ధతిలో కొనుగోలు చేస్తది. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ఎంతో దోహదపడ్తది అని భట్టి అన్నారు.

## సెప్టెంబర్ 17, 18 తేదీల్లో మందు బంద్

మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. సెప్టెంబర్ 17 ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 18 సాయంత్రం 6 గంటల వరకు అన్ని వైన్ షాపులు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేరిట తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు జంట నగరాల పరిధిలోని స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ల అదనపు ఇన్‌స్పెక్టర్‌లకు అధికారం ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

## గణేష్ ఉత్సవాల్లో "పోకిరీలకు" షీ టీం చెక్

### మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 285 మంది అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గణపతి నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మహిళల పట్ల కొందరు ఆకతాయిలు అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. దీంతో పోకిరీలకు షీ టీమ్స్ చెక్‌పెడుతున్నాయి. గణేష్ ఉత్సవాల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 285 మంది అకతాయిలను షీ టీమ్స్ పట్టుకున్నారు. కాగా గణేష్ ఉత్సావాల సందర్భంగా ఖైరతాబాద్ బడా గణపతి వద్దకు వేలాది సంఖ్యలో మహిళలు, యువతులు హాజరయ్యారు. ఈ క్రమంలో వారి పట్ల కొందరు ఆకతాయిలు అనుచితంగా ప్రవర్తించారు. గడిచిన ఏడు రోజుల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన 285 మందిని అరెస్ట్ చేసినట్టు షీ టీమ్స్ తెలిపాయి. ఇక, గణేష్ ఉత్సవాల్లో మహిళల భద్రతపై హైదరాబాద్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ సందర్భంగా మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఆర్థికంగా రాణిస్తున్న భారత్

రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధం చాలా దేశాల ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది. కానీ భారత్ మాత్రం ఈ విపత్కర పరిస్థితుల్లోనూ మెరుగ్గా రాణించింది. పలు దేశాలకు అండగా నిలుస్తూ.. ఆర్థికంగా స్థిరంగా కొనసాగుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో భారత్.. స్థిరంగా ఉండేందుకు ప్రధాన కారణం దౌత్యపరమైన అవగాహన. యూరోపియన్ దేశాలకు రష్యా చమురు సరఫరాను నిలిపివేసిన తర్వాత.. ఇతర వనరులను వెతికే పనిలో పడ్డారు. దీని కారణంగా ప్రపంచ మార్కెట్‌లో చమురు డిమాండ్ విపరీతంగా పెరిగింది. అలాగే చమురు ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీని ప్రభావం భారత్‌పై కూడా ప్రత్యక్షంగా పడింది. ద్రవ్యోల్బణం, దిగుమతుల సంక్షోభం ఏర్పడింది. దీనికి కారణంగా భారత్ తన చమురు సరఫరాలో 80 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దౌత్యం ద్వారా ఈ విపత్కర పరిస్థితుల్లో నిలదొక్కుకుంది. పాశ్చాత్య దేశాలతో తమ బంధాన్ని సమతుల్యం చేస్తూ భారతదేశం చమురును దిగుమతి చేయడం ప్రారంభించింది. ఫలితంగా ప్రపంచ సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ప్రభుత్వం స్థిరంగా ఉంది. రష్యాపై వివిధ దేశాల నుంచి అనేక ఆంక్షలు ఉన్నప్పటికీ, భారతదేశం చౌకగా చమురును కొనుగోలు చేస్తూ వస్తోంది. ఇది భారతదేశ ఆర్థిక కోణాన్ని మరింతగా పెంచింది. దీని వల్ల దేశీయ ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. మరోవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం చమురు ధరలపై ప్రధానంగా ప్రభావం చూపింది. దీని కారణంగా చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కనిపించాయి. ఈ పరిస్థితి భారతదేశానికి పెద్ద సవాలుగా మారింది. కానీ రష్యా నుంచి తక్కువ ధరకు చమురును కొనుగోలు చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ విపత్కర పరిస్థితిని అదుపులో ఉంచింది. దీని వల్లే దేశంలో చమురు ధరలు కంట్రోల్‌లో ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు బ్రెక్సిట్, కరోనావైరస్, దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య కలహాలు సవాళ్లుగా కనిపిస్తున్నప్పటికీ, రానున్న దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అంచనా. ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా వృద్ధి రేటుని 26 శాతంగా అంచనా వేసినప్పటికీ, 2050 నాటికి ప్రపంచ మార్కెట్ ప్రస్తుతం ఉన్న స్థాయి కన్నా రెట్టింపు కావచ్చు. ఈ ఎదుగుదలతో పాటు ప్రపంచంలో అనేక మార్పులు కూడా చోటు చేసుకుంటాయి. భవిష్యత్ ఎలా ఉంటుందనే విషయాన్ని కచ్చితంగా చెప్పలేకపోయినప్పటికీ, అత్యధిక మంది ఆర్థిక వేత్తలు మాత్రం నేడు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లే రేపటి ఆర్థిక సూపర్ పవర్లనే విషయాన్ని ఏకాభిప్రాయంతో చెబుతున్నారు. ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ) అంతర్జాతీయ సంస్థ విడుదల చేసిన 'ది వరల్డ్ ఇన్ 2050' నివేదిక ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న జాబితాలో ఉన్న 7 దేశాలలో 6 దేశాలు ఇంకో 30 ఏళ్లలో అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేరుతాయని పేర్కొంది.

అమెరికా (రెండవ స్థానం నుంచి 3వ స్థానానికి), జపాన్ (4 నుంచి 8వ స్థానానికి) జర్మనీ (5 నుంచి 9 వ స్థానానికి) పడిపోతాయని వ్యాఖ్యానించింది. వియత్నాం, ఫిలిప్పీన్స్, నైజీరియా లాంటి ఆర్థిక వ్యవస్థలు కూడా మరో 30 ఏళ్లలో గణనీయంగా అభివృద్ధి చెందుతాయని ఈ నివేదిక చెప్పింది. అభివృద్ధి పథంలో ఉన్న దేశాలలో గణనీయంగా చోటు చేసుకుంటున్న మార్పులని అక్కడి ప్రజలు స్వీకరిస్తున్న విధానం, , ఆ దేశాల్లో నివసించడం వలన ఉండే లాభాలు, ఎదురవుతున్న సవాళ్ళను అర్థం చేసుకునేందుకు బీబీసీ ఐదు దేశాల పౌరులతో మాట్లాడింది. పర్చేసింగ్ పవర్ పారిటీ (పిపిపి) అనే అంతర్జాతీయ సంస్థ అంచనా వేసిన స్థూల జాతీయ ఉత్పత్తి ప్రకారం, చైనా ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆర్థిక వ్యవస్థగా పరిణమించింది. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఎదిగినప్పటికీ, ఈ ఎదుగుదల కేవలం శిఖరానికి ఒక అంచులాంటిదేనని, భవిష్యత్లో ఇది మరింత అభివృద్ధి చెందుతుందని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. చైనాలో నివసిస్తున్న వారి కళ్ళ ముందే అతి పెద్ద ఆర్థిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. "గత కొన్నేళ్లుగా నేను నివసిస్తున్న షిజో ఇండస్ట్రియల్ పార్క్ షాపింగ్ మాల్స్, పార్కులు , రెస్టారంట్లు , ట్రాఫిక్ తో నిండిపోయింది. ఇక్కడికి నేను 15 ఏళ్ల క్రితం వచ్చినప్పుడు ఇక్కడ అంతా వ్యవసాయ భూమి ఉండేది ", అని వన్ మినిట్ చైనీస్ బుక్స్ అనే పుస్తకం రాసిన రోవాన్ కోల్ చెప్పారు. "ఇది చైనా లో ప్రతి రోజు జరుగుతున్న కథే. దేశం అంతా శరవేగంగా మారిపోతోంది". ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాలలో రెండవ స్థానంలో ఉన్న భారత దేశం మరో మూడు దశాబ్దాల్లో ఏటా సగటున 5 శాతం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పెరుగుదలతో గణనీయంగా ఆర్థిక అభివృద్ధి సాధించనుందని నివేదిక పేర్కొంది. 2050 కల్లా భారతదేశం, అమెరికాను అధిగమించి ప్రపంచ స్థూల జాతీయ ఉత్పత్తిలో 15 శాతం వాటాతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో రెండవ స్థానంలో నిలుస్తుందని అంచనా వేసింది. ఈ అభివృద్ధి ఫలాలు ఇప్పటికే ప్రజలకు చేరడం ప్రారంభమైంది. "20వ శతాబ్దం చివర నుంచి 21వ శతాబ్దం ఆరంభం వరకు నా కళ్ళ ముందు దేశ స్వరూపం మారిపోవడం చూస్తున్నాను" అని టాక్ ట్రావెల్ యాప్ నిర్వాహకుడు సౌరభ్ జిందాల్ అన్నారు. ఆర్థిక రంగంలో చోటు చేసుకున్న మార్పులు ప్రజల జీవన విధానంలో, నగర జీవితంలో, దేశ పౌరుల నడవడిక, అలవాట్లలో అనేక మార్పులు తెచ్చాయని ఆయన వివరించారు. విమాన ప్రయాణాలు చాలా మందికి అందుబాటులోకి రావడమే కాకుండా, చాలామంది ఖరీదైన , విలాసవంతమైన భవనాలలో నివసిస్తున్నారని అన్నారు. అలాగే పలు రాయితీల ద్వారా వినియోగదారులపై ద్రవ్యోల్బణం భారాన్ని తగ్గించింది మోదీ సర్కార్. ఒకవైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఉన్నప్పటికీ.. ప్రధాని మోదీ ఏకాభిప్రాయం.. భారతదేశ ఖ్యాతిని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడటంలో దోహదపడింది. చమురు సరఫరా, ధరల నియంత్రణను అదుపులో ఉంచడం, దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడంలో ప్రభుత్వం అద్భుత విజయం సాధించిందనే చెప్పాలి

## కానిస్టేబుల్‌పై ఎస్పీ సస్పెన్షన్ వేటు



పెబ్బేరు, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): పోలీసు ప్రతిష్టను భ్రష్టు పట్టించేలా సిబ్బంది వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ (ఐపీఎస్) హెచ్చరించారు. అసభ్యకర ప్రవర్తన కలిగిన కానిస్టేబుల్ పై సస్పెన్షన్ విధిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రప్రసాద్ అనే కానిస్టేబుల్ చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. అయితే కొంత కాలంగా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యాడు.

పెబ్బేరు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ కు ట్రాఫిక్ డ్యూటీ పెట్టినా కూడా నేను వెళ్ళను అని పెబ్బేరు ఎస్ఐ దగ్గర గొడవ పెట్టుకోవడం జరిగింది. ఎస్ఐ చాంబర్లో ఎస్సై దగ్గర ఉన్న ల్యాప్ టాప్ పగలగొట్టడం జరిగింది. ఈ విషయాన్ని ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడమే కాక ఆ ప్రాంత పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బందిపాలు చేస్తున్నాడని ఎస్పీ దృష్టికి రాగా అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక పంపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు విచారణ జరిపి నివేదికను ఎస్పీకి పంపగా శనివారం అతనిపై సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడం లాంటివి జరిగి నిర్ధారణ అయితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం, ప్రజలతో అసభ్యంగా ప్రవర్తించడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడం లాంటివి జరిగి నిర్ధారణ అయితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు



పెబ్బేరు, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): విద్యుత్ ఆదాచేయాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్న అధికారులు వీధి దీపాలు ఆపే నాధుడు లేక పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం సైతం వీధి దీపాలు పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో వెలుగుతున్నాయి. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయితీ అధికారులు, పట్టించుకోక పోవడంతో వీధి దీపాలు పగలంతా వెలుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వలన విద్యుత్ వృద్ధాగా ఖర్చు అవుతుంది. వృద్ధా అవుతున్న విద్యుత్ ఖర్చును ప్రజలపై వేసి వసూలు చేస్తారేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పెబ్బేరు మండల కేంద్రమైన రంగాపురం గ్రామంలో పలు కాలనీల్లో నిరంతరం పట్టగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ దీపాలు పగలు వెలగకుండా నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు

## లేబర్ ఇన్సూరెన్స్ విధానాన్ని ప్రైవేటుపరం చేయకూడదు

♦ భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు డిమాండ్





ఆత్మకూర్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో భవన నిర్మాణ కార్మిక రంగ సంస్థ యొక్క సమావేశం ఏర్పాటు చేశారు ఇట్టి సమావేశానికి వనపర్తి జిల్లా కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణరంగ కార్మికులకు ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగిస్తూ ప్రసూతి సహాయం పెళ్లి కానుక సహాయం 30 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని ప్రమాద మరణ సహాయం ఆరున్నర లక్షల నుంచి పది లక్షలకు పెంచాలని కార్మికులకు పెన్షన్ స్కీములను అమలు చేసి పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, నిర్మాణరంగ కార్మికులకు పిఎఫ్ సౌకర్యాన్ని కూడా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులకు వృత్తిపరమైన పరికరాలు 10 లక్షల లోన్ లో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భవాని నిర్మాణ కార్మికులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ను నాశనం చేస్తున్నారు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్: పోలీసులు ఎమ్మెల్యేల ఇండ్లచుట్టూ ఉండి హౌస్ అరెస్టు చేయడం మంచిది కాదు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేయడం చాలా దారుణమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రశాంతంగా ఉన్న హైదారాబాద్ ను నాశనం చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరెట్ ఏర్పడిన నాటి నుండి ఇలాంటి సంఘటనలు ఎప్పుడు జరుగలేదు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీ కోసం వెళ్తే ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం కరెక్టేనా. సీపీ కార్యాలయంకు వెళ్లినందుకు పోలీసులు అరెస్టు చేసి 180 కిలోమీటర్లు తిప్పారు. ఇలాంటి అలజడులు సృషిస్తే ప్రజలు చూస్తే ఊరుకోరు. తెలంగాణ రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నాం ఆంధ్ర తెలంగాణ అని ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నారు. హైడ్రా పేరుతో ఒకవైపు పేద ప్రజల ఇండ్లను కూల్చడం భయపెట్టడం మరోవైపు ఎమ్మెల్యేల ఇండ్లపై దాడులు చేయడం ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. వినాయక చవితి సమయంలో ఎలాంటి అల్లార్లకు తావులేకుండా పోలీసులు చూసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణం ఉండేలా సీఎం రేవంత్ రెడ్డి విధంగా చూడాలని అన్నారు.

## రైతు రుణమాఫీ సగం కూడా కాలేదు

– రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలి

– మున్సిపల్ కౌన్సిలర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండ్ల రామకృష్ణ





ఆత్మకూర్ సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని మున్సిపల్ కౌన్సిలర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మండ్ల రామకృష్ణ విమర్శించారు. శనివారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అందరికీ రుణమాఫీ అయిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని ఆరోపించారు. 9 నెలల కాంగ్రెస్ పాలన రైతుల పాలిట యమ శాపంగా మారింది. పంద్రాగస్టు వరకే రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎం అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రేషన్ కార్డుతో లింకు లేదని అసెంబ్లీ సాక్షిగా సర్కార్ చెప్పిన మాటలన్నీ అబద్ధాలని గుర్తు చేశారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు చేతలకు పొంతనలేని స్పష్టంతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ఇప్పటివరకు 475 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. రుణమాఫీకి రూ 49 వేల కోట్లని ఎన్నికల ముందు చెప్పిన సీఎం అసెంబ్లీలో ఆ మొత్తాన్ని రూ 31 వేల కోట్లకు కుదించారని బడ్జెట్లో మాత్రం రూ 27 వేల కోట్లు మాత్రమే కేటాయించారని విమర్శించారు. తీరా అమలుకు వచ్చేసరికి పదహారేళ్ల కోట్లు మాత్రమే విడుదల చేశారని గుర్తు చేశారు. రైతు భరోసా అంటూ చిక్కని సమస్యగా మారిందని ఏదేవ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి మాటలకు ముఖ్యమంత్రి మాటలకు పొంతన లేకుండా ఉందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## మద్యం దుకాణాల బంద్

కంఠేశ్వర్ : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 15న (నేడు) గణేశ్ నిమజ్జనం, శోభాయాత్రకు నిజామాబాద్ జిల్లాలో సంబంధిత అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ గణేశ్ నిమజ్జనం దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని సీపీ కల్మేశ్వర్ శనివారం ఆదేశిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. నేడు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు మద్యం అమ్మరాదని తేల్చి చెప్పారు. అలాగే బార్లు, క్లబ్లు మూసేయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీతారాం ఏచూరికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘన నివాళులు



పరకాల, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యలపై జీవితాంతం పోరాటం చేసిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి తిరుపతి అన్నారు. హనుమకొండ కుమార్ పల్లిలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే జేఎన్యులో విద్యారంగ పరిరక్షణ కోసం సమాజ మార్పు కోసం, పోరాటాలు చేసిన ఆయన, దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను నిర్మాణం చేసి, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై, అనునిత్యం పోరాటం చేసిన, ఆయన పోరాటాలు చిర స్మరణీయమని, పెట్టుబడిదారీ సామ్రా జ్యవాద విధానాలకు వ్యతిరేకంగా, పోరాటాలు చేసిన, మతోన్మాద విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ దేశ రక్షణ, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం జీవితాంతం కృషిచేసిన ఏచూరి జీవితం ఆదర్శమని, జీవనంతో పాటు మరణంలో కూడా ఆయన ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమం లో డివైఎఫ్ఐ నాయకులు గ్యారే వినీల్ కుమార్, జంపాల రాజేందర్, దయ, కేశవ, మనోజ్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు తూముల, సదానందం, రంగారావు, ప్రభాకర్, వంశీ, పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్





కామారెడ్డి: మాచారెడ్డి మండలంలో స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తేదీ 02/09/2024 నా గజ నాయక్ తండ కి చెందిన పందిరి రాజవ్వ చైన్ స్నాచింగ్ కేసులో నేరస్తులైన మ్యడం సంతోష్, గడి ముందటి మానస లను శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వారు అనుమానస్పదంగా కనిపించడంతో పట్టుకొని అరెస్టు చేసి విచారించగా వారు వరసకు మేనత్త అయిన పందిరి రాజావ్వ గొలుసును దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచి జేలుకు పంపించడం జరిగిందన్నారు. ఇట్టి నేరానికి పాల్పడిన సంతోష్, మానస అనే వ్యక్తులకు అప్పులు ఎక్కువైనందున ఎలాగైనా అప్పులు తీర్చాలని సంతోష్ కి వరుసకు మేనత్తయిన రాజవ్వ మెడలో నుండి చెయిన్ దొంగలించి అప్పులు తీర్చాలని సంతోష్, మానసలు ప్లాన్ చేసుకొని అట్టి చెయిన్ నీ దొంగలించుకుని వెళ్లి శుక్రవారం అట్టి చైను నీ ఎక్కడైనా అమ్ముకుందామని బైక్ పైన వెళ్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు.

## అనారోగ్యంతో భాదపడుతున్న బీఆర్ఎస్ నాయకులకు చల్లా పరామర్శ





పరకాల, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): కొద్దిరోజులుగా అనారోగ్యంతో భాదపడుతున్న హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కేతిపెల్లి శ్రీధర్ రెడ్డిని, దామెర మండల ఆంధ్రజ్యోతి విలేకరి మన్నెం ఇంద్రా రెడ్డిని, ఊరుగొండ మాజీసర్పంచ్ మల్లాడి రాజిరెడ్డి కోడలు మల్లాడి సింధుని శనివారం ఉదయం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పరామర్శించిన వారి మండల అధ్యక్షులు గండు రాము, మాజీ వైస్ ఎంపిపి ఎండి జాకిర్ అలీ, బిఆర్ఎస్ నాయకులు కాంతాల కేశవ రెడ్డి, పుల్యాల రఘుపతి రెడ్డి, సావురే రాజేశ్వర్ రావు, రమేష్ తదితరులు ఉన్నారు.

# 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

## కార్మికులకు జిల్లా అధ్యక్షులు దాస్యం పిలుపు



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): ఈ నెల 23న భవన నిర్మాణ కార్మికులు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్మిక కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమ నిర్వహణ జరగనున్నట్లు తెలిపారు. 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా, నిరసన కార్యక్రమాల కరపత్రాన్ని ఆయన శనివారం రోజున బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాయలంలో ఆవిష్కరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికులు, వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసేదని కానీ నేడు ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాల అమలును ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని, బోర్డు నిధులు దుబారా కాకుండా చూడాలని కోరారు. గతంలో అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిల్స్‌లను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. బీమా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రసూతి, దహన సంస్కారాల ఖర్చులకు ఇచ్చే నిధులు రూ.1 లక్షకు పెంచాలని కోరారు. గత ప్రభుత్వం కార్మికుల కోసం కేటాయించిన 24 గుంటల స్థలంలో ప్రభుత్వం నిధులు కేటాయించి భవనాన్ని నిర్మించాలని, దాని ద్వారా కార్మిక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఆరోగ్య శ్రీ ని మెరుగుపరిచి కార్మిక నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. కరపత్రాన్ని ఆవిష్కరించిన వారిలో నాయిని రవి, సీఐటీయూ నాయకులు టీ ఉప్పలయ్య, తేలు సారంగపాణి, పుల్ల అశోక్, సిరికొండ భిక్షపతి, కేబీఎన్కేఎస్ నాయకురాలు సంపూర్ణ, మంజుల, టీఎస్టీయూ జిల్లా కార్యదర్శి కుసుమ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# తండాలో గణేష్ మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం







♦ జాటోత్ మౌనిక భరత్ కు గ్రామ ప్రజల అభినందనలు

వెంకటాపూర్, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 8వ రోజును పురస్కరించుకొని ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ఇంచెన్ చెరువుపల్లీ గ్రామం పెద్ద తండాలో గణేష్ మండపం వద్ద నిర్వహించిన మహా అన్నదానం కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. మహా అన్నదానం కార్యక్రమం గ్రామంలో చేయడం చాలా సంతోషగా వుందని గ్రామ మాజీ సర్పంచ్ మాజీ ఉప సర్పంచి మరియు గ్రామ వార్డ్ మెంబర్స్ వారు కొనియాడడం జరిగింది. మహా అన్నదానం అనేది గొప్ప కార్యక్రమాన్ని అతి జాగ్రత్తగ కార్యక్రమాన్ని విజయంత్సవంగా ఎలాంటి అవరోధాలు లేకుండా గ్రామ ప్రజలకు కావలసిన అన్ని ఆ లంబోదరుని యొక్క విందు గ్రామ ప్రజలు స్వీకరించడం జరిగిందన్నారు. అన్న దాత నిర్వాహకుడు జాటోత్ మౌనిక భరత్ కు గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేయడం జరిగినది.

# మృతుల కుటుంబాలకు మాజీ జడ్పీ చైర్పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శ





ములుగు, సెప్టెంబర్ 14 (తీన్మార్ న్యూస్): లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గాంధర్ల రమేష్ నానమ్మ సమ్మక్క గత కొన్ని రోజు ల క్రితం అనారోగ్యం తో మరణించగ స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ జడ్పీ ఛైర్పర్సన్ బడే నాగజ్యోతి శనివారం వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. తదుపరి హన్మకొండలోని కాశిబుగ్గలో నివాసం ఉంటున్న బిఆర్ఎస్ కార్యకర్త అయినా మొహమ్మద్ ఆంజాత్ అనారోగ్యంతో మరణించడం జరిగింది. వీరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన మృతదేహానికి పూల పూలమాలవేసి నివాళు లర్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు జల్లెల కొమురయ్య,మాజీ ఉప సర్పంచ్ గంధార్ల వెంకన్న, ex mptc లకావత్ చందులాల్, బోదె పోయిన ముత్తయ్య, గ్రామ పెద్ద మనిషి,చేరుకుల అపర్ణ, కవిత, యాకన్న, రమేష్, సాంబయ్య,రామ కృష్ణ, ఉపధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న వినాయక మండపాల వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి..

## హుస్నాబాద్ ఏసీపీ వి. సతీష్

హుస్నాబాద్: ఒక పండుగ వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలి కుటుంబ సభ్యులతో యుక్తంగా సాంప్రదాయ బద్ధంగా వినాయక నిమజ్జనం చేసుకోవాలి.

అందరూ కలిసికట్టుగా పండుగలు జరుపుకుంటే ఆనందంగా వుంటుందని ఏసీపీ సతీష్ అన్నారు. వినాయక నిమజ్జనం కొరకు ఉపయోగించే వాహనం మంచి కండిషన్లో ఉండేటట్టు చూసుకోవాలి, మీరు ఎంచుకున్న తేదీలలో నిమజ్జనం పూర్తి చేయాలి. గణేష్ నిమజ్జన కార్యక్రమంలో సాంప్రదాయ బద్ధంగా భక్తి పాటలు దేవుని పాటలు పాడుకుంటూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలి. ఊరేగింపు సమయంలో బాణాసంచ కాల్చవద్దు, మరియు డీజే లకు అనుమతి లేదు, బాక్స్ టైపు రెండు స్పీకర్లు మాత్రం పెట్టుకోవాలి, నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమంలో ఇతరులపై రంగు, గులాల్ మొదలగునవి చల్లవద్దు నిమజ్జన కార్యక్రమంలో అపరిచిత వ్యక్తులను నమ్మవద్దు, మరియు మద్యం సేవించి గణేష్ నిమజ్జనంలో పాల్గొనవద్దు, భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే షికార్లు పుకార్లు నమ్మవద్దు. చెరువులు కుంటలు పూర్తిగా నిండి ఉన్నందున వాటి లోతు తెలియకుండా అందులోకి దిగి ప్రమాదాలకు గురి కావొద్దు, చిన్నపిల్లలను ఎట్టి పరిస్థితుల్లో కూడా చెరువుల దగ్గరికి తీసుకొని వెళ్ళవద్దు, వినాయక నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులు ప్రజలు ప్రజాప్రతినిధులు యువకులు నిమజ్జనం సందర్భంగా పోలీసు వారి సలహాలు సూచనలు పాటించి ఒక పండుగ వాతావరణం లో వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించుకోవాలని హుస్నాబాద్ ఏసిపి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మళ్లీ తెరపైకి తెలంగాణ సెంటిమెంట్

హైదరాబాద్: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మధ్య రెండు రోజులుగా వివాదం కొనసాగుతోంది. గాంధీ బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందారు. అయితే.. ఇటీవల ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం పీఏసీ చైర్మన్ పదవిని ఇచ్చింది. దాంతో అప్పటి నుంచి ఈ ఇద్దరి ఎమ్మెల్యేలు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిన్న కౌశిక్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చీరె, గాజులు పంపుతున్నాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందులో భాగంగానే గాంధీ ఇంటికి వెళ్లి ఆయన మెడలో బీఆర్ఎస్ కండువా వేస్తానని.. ఆయన ఇంటి ముందు గులాబీ జెండా ఎగురవేస్తానంటూ సవాల్ చేశారు.దీనికి స్పందించిన గాంధీ 'దమ్ముంటే నా ఇంటికి రావాలి' అని ప్రతిసవాల్ చేశారు. లేదంటే తానే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్తానంటూ హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి గాంధీ ఇంటికి రాకపోవడంతో.. ఆయన తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున కౌశిక్ ఇంటికి చేరుకున్నారు. ఆయన ఇంటిపై దాడికి దిగారు. దమ్ముంటే కౌశిక్ బయటకు రావాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. ఫైనల్‌గా గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు.ఇదిలా ఉండగా.. ఈ వివాదాన్ని కొనసాగిస్తూ కౌశిక్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సారి వివాదంలోకి ప్రాంతీయతను తీసుకొచ్చారు. 'ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలంగాణకు బతకడానికి వచ్చాడు. ఆంధ్రోళ్లు దాడి చేస్తే తెలంగాణ వాళ్లం ఊరుకుంటామా. తెలంగాణ అంటే ఏంటో చూపిస్తాం' అంటూ హెచ్చరించాడు. ఈ వ్యాఖ్యలు కాస్త ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.మరోవైపు.. కౌశిక్ రెడ్డిపై దాడిచేయడాన్ని ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత ఎలా స్పందిస్తారనే ఉత్కంఠ కూడా నెలకొంది. తెలంగాణ ఎమ్మెల్యే, అదీ సొంత పార్టీ ఎమ్మెల్యే ఇంటిపై ఆంధ్ర నుంచి వచ్చి ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే దాడిచేయడాన్ని ఆయన ఎలా చూస్తారని చర్చ కొనసాగుతోంది.దాడి తర్వాత మీడియాతో మాట్లాడిన పాడి కౌశిక్‌రెడ్డి పోలీసుల తీరును తప్పు పట్టారు. తాను నిఖార్సైన తెలంగాణ వాదినని.. గాంధీ తెలంగాణకు బతకడానికి వచ్చాడని ఆరోపించారు. తెలంగాణ వాడిపై దాడిచేస్తే తెలంగాణ సమాజం ఎలా స్పందిస్తుందో రేపు చూపిస్తా అని హెచ్చరించారు. నాన్‌లోకల్ వ్యాఖ్యలపై గాంధీ కూడా దీటుగా స్పందించారు. తెలంగాణ ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. కరీంనగర్ నుంచి కౌశిక్ హైదరాబాద్‌కు ఎందుకు వచ్చాడని ప్రశ్నించాడు. కఠిన పదాలను ఉపయోగించాడు.తాజాగా పాడి కౌశిక్‌రెడ్డి మాటలు ఇప్పుడు మళ్లీ ప్రాంతీయవాదాన్ని తెరపైకి తెచ్చాయి. అసలైన తెలంగాణవాదులం అని మాట్లాడడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రేపు తెలంగాణ సత్తా చూపుతామనడంతో ఎలాంటి పరిస్థితి తలెత్తుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు తెలంగాణలో ఉన్నవారంతా తెలంగాణ వాదులే అని గతంలోనే కేసీఆర్ ప్రకటించారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డి.. ఇప్పుడు వివాదాస్పద నాన్ లోకల్ అంటూ మాట్లాడడం ఇప్పుడు బీఆర్ఎస్‌లోనూ చర్చనీయాంశమైంది.

దీనిపై గులాబీ నేతలు ఎలా స్పందిస్తారో చూడాలిమొత్తానికి తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా కేసీఆర్ ఆంధ్రానాయకులను మాటల పరంగా టార్గెట్ చేశారే తప్పితే.. ఏనాడూ ఎవరూ భౌతిక దాడులకు దిగలేదు. తెలంగాణ వచ్చాక కూడా పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో కొనసాగింది. ఆ సందర్భంలోనూ ఏనాడూ ఆంధ్ర వాళ్ల జోలికి వెళ్లలేదు. ఎందుకంటే.. కొంత మంది ఆంధ్రా సెటిలర్స్ కూడా ఆయనకు మద్దతు తెలిపారు. అరికెపూడి గాంధీ కూడా బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేనే. ఆయన పార్టీ మారినంత మాత్రాన కౌశిక్ రెడ్డి ఆంధ్ర నాయకుడిగా ముద్ర వేయడం ఎంతవరకు సమంజసమనే విమర్శ కూడా వినిపిస్తోంది.

# హైదరాబాద్ లో భారీగా గంజాయి స్వాధీనం




హైదరాబాద్: నిందితులు అందరూ మహారాష్ట్రలోని ఒకే గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు హైదరాబాద్‌లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెద్ద అంబర్‌పేట ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు 170 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి తెలిపారు. కొన్ని రోజులుగా నిందితుల కదలికలను గమనిస్తున్నామని, పక్కా సమాచారంతో 170 కిలోల గంజాయిని సీజ్ చేశామని వెల్లడించారు.

ఈ ముఠాలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితులు అందరూ మహారాష్ట్రలోని ఒకే గ్రామానికి చెందిన వారని వెల్లడించారు. గంజాయిని తరలించే వాహనానికి మరో వాహనం ఎస్కార్ట్‌గా ఉన్నట్లు తెలిపారు. ఈ గంజాయిని మల్కాన్‌గిరి ప్రాంతంలో ప్యాక్ చేశారని, మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ముఠాలో ఇస్మాయిల్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.34 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నిందితుల చరిత్రను బట్టి పీడీ యాక్ట్ పెడతామన్నారు.

# పార్టీ ఫిరాయింపులకు బీఆర్ఎస్ పార్టీ నాంది




రాయపోల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదని,ఫిరాయింపుల్లో మాస్టర్ బీఆర్ఎస్ పార్టీ,ఈ విషయంలో ఆ పార్టీ డాక్టరేట్ సాధించిందని దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మద్దెల స్వామి అన్నారు. శనివారం దౌల్తాబాద్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు యావత్ సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు.బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక టీడీపీ,సీపీఐ,సీపీఎం, కాంగ్రెస్ పార్టీ సభ్యులను చేర్చుకున్నదని గుర్తు చేశారు.పార్టీకి రాజీనామా కూడా చేయని టీడీపీ వ్యక్తిని బీఆర్ఎస్ అనైతికంగా చేర్చుకుని మంత్రి పదవి ఇచ్చిన చరిత్ర ప్రజలు మరువలేదన్నారు. బీఆర్ఎస్,బీజేపీ గొంతుకలిపి తమ ప్రభుత్వాన్ని కూలగొడతామన్న మాట నిజం కాదా అని ప్రశ్నించారు. పేదల కోసం పని చేస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తుంటే వారిపై బురద జల్లుతున్నారని పేర్కొన్నారు.వారు చేస్తే రాజకీయ నీతి, తాము చేస్తే తప్పా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దళిత వ్యక్తిని సీఎల్పీ లీడర్ చేస్తే ఓర్వలేక తమ పార్టీని బలహీన పర్చలేదాన్నారు.కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ప్రతిపక్షాల గొంతు నొక్కలేదన్నారు.ధర్నాచౌక్ లో ధర్నాలకు అవకాశం ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేసినా,వ్యక్తిగత విమర్శలు చేసినా జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దొమ్మాట గ్రామ అధ్యక్షులు బొర్రోళ్ల స్వామి, నాయకులు మద్దెల శ్రీకాంత్,మల్లని రాజు, సూరంపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోకిరిలపై పోక్సో కేసులు

హైదరాబాద్: హైదరాబాదులో బాలికల పరిస్థితి బాధాకరంగా మారింది. పలు సందర్భాల్లో బాలికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపల స్పష్టంగా కనిపిస్తుంది. దీని తదనంతరం తన సందర్భాల్లో బాలికలు సైతం కొందరు పోకిరిల వలకు చిక్కుతున్నారు. హైదరాబాదులో నమోదు అవుతున్న పోక్సో కేసులు భయాందోళన కలిగిస్తున్నాయి.. ఏడాది వ్యవధిలో చోటు చేసుకున్న కేసుల సంఖ్య కంటే ఏడాది ఎనిమిది నెలల్లో చోటు చేసుకున్న కేసుల సంఖ్య అధికంగా కావటమే ఇనీదుకు కారణం.హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజు బాలికలు మోసపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 71 పోలీస్ స్టేషన్లో ఉన్నాయి. వీటిలో ప్రతిరోజు ఇలాంటి ఫిర్యాదులు లేదా ఈ తరహా కేసులు వస్తూనే ఉన్నాయి. ప్రతిరోజు ఒకటి లేదా రెండు కేసులు నమోదవుతున్నాయి. బాలికలను వంచించి మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. 2023లో ఇలాంటి మొత్తం 377 కేసులు నమోదుకాగా ఈఏడాది ఇప్పటి ఆగస్టు వరకు సుమారు 500 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇక్కడ ఏడాది మొత్తంలో నమోదైన కేసుల సంఖ్య 377. 2022లో నమోదైన కేసుల సంఖ్య 428. ఇలా గతంతో పోలిస్తే ఏడాది ఎనిమిది నెలల వ్యవధిలోనే అత్యధిక కేసులు నమోదు కావటం విశేషం. మోసపోతున్న చిన్నారుల సంఖ్యలో అధికంగా 12 నుంచి 15 వయసు గల బాలికలు బాధితులుగాఉంటున్నారు.మరోవైపు బాలికలను ట్రాప్ చేసి మోసం చేస్తున్న నిందితుల సంఖ్య సగటున 25 నుంచి 35 వయసుగల యువకులు ఉంటున్నారు. ప్రతి ఏటా 400కు పైగా ఫోక్సో కేసులు నమోదు అవుతున్నాయి.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

## - బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



యైటింక్లైన్ కాలనీ: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీ పిలుపుమేరకు ఆయనకు మద్దతుగా వెళ్తున్న 8వ కాలనీ బిఆర్ఎస్ నాయకులను గోదావరిఖని టూ టౌన్ పోలీస్ వారు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై గుండాలతో వచ్చి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒకవేళ మేము అధికారంలో ఉన్న 10 ఏళ్లలో కాంగ్రెస్ నాయకుల పై దాడి చేస్తే ఒక్కరు కూడా మిగిలేవారు కాదని వారు అన్నారు.పోట్లాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి ధ్యేయంగా మా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేశారని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం దాడులే ధ్యేయంగా పని చేస్తున్నాడని దుయ్యబట్టారు. అరెస్టులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని ప్రజా పాలన పేరుతో అక్రమంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తొందరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని వారు అన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు మేడి సదానందం,కిషన్ రెడ్డి,స్టాలిన్ గౌడ్,పులి రాకేష్ , దాసరి బాలరాజు,కుమార్ నాయక్, ఉన్నారు.

# వసతి అదోగతి

**- ఎస్సీ, బీసీ వసతిగృహాలకు దరిచేరని బిల్లులు**
**- మూడు నెలల రాకపోవడంతో హెచ్‌డబ్ల్యూఓల తిప్పలు**
**- అప్పులు చేసి నిర్వహిస్తున్నామంటున్న అధికారులు**




ఆదిలాబాద్ : ఏండ్లుగా నిరుపేద విద్యార్థులకు వసతి కల్పిస్తూ చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్న వసతిగృహాల పట్ల సర్వత్రా నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. గతంలో గురుకులాలు అతి తక్కువగా ఉన్న సమయంలో ఎక్కువ మంది విద్యార్థులకు అండగా నిలిచిన ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల పట్ల ప్రభుత్వం అంతగా దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 22 వసతిగృహాలు ఉండగా.. సుమారు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బీసీ వసతిగృహాలు 14 వరకు ఉండగా 1165మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఉండే ఈ వసతిగృహాల్లో వివిధ మారుమూల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పై చదువులకు అవకాశం లేకపోవడంతో అనేక మంది మండల, జిల్లా కేంద్రాలకు వచ్చి చదువులు కొనసాగిస్తున్నారు. ఇక్కడ నివాసముంటూ సమీపంలోని పాఠశాలలో చదువుకుంటున్నారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఈ వసతిగృహాలు గురుకులాల సంఖ్య పెరిగిపోవడం..ప్రభుత్వాలు వాటికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో వీటికి ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. కానీ ఇప్పటికీ అనేక మంది నిరుపేద విద్యార్థులకు వసతి కల్పిస్తూ ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నాయనడంలో సందేహం లేదు.

**మూడు నెలలుగా బిల్లులు లేవు**

వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వమే మెస్ ఛార్జీలు, కాస్మోటిక్‌తో పాటు వసతిగృహల మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లిస్తుంది. ఒక్కో విద్యార్థికి సుమారు రూ.26 చొప్పున భోజనం బిల్లులు అందజేస్తోంది. ఇలా ఒక్కో వసతిగృహంలో సుమారు 50 నుంచి 100మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ సూచన మేరకు మెనూ ప్రకారమే భోజనం పెట్టాల్సి ఉంటుంది. ఉదయం టిఫిన్, రాత్రిభోజనం తప్పకుండా అందించాలి. సెలవు రోజుల్లో మూడు పూటలు పెట్టాల్సి ఉంటుంది. ఒక్కో వసతిగృహానికి ప్రతి నెలా రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు బిల్లు రావాల్సి ఉంటుంది. కానీ ఎస్సీ, బీసీ వసతిగృహాలకు గత మూడు నెలల నుంచి బిల్లులు దరిచేరకపోవడంతో వసతిగృహాల అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సరకుల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించలేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. సకాలంలో బిల్లులు రాకపోవడం మూలంగా అధికారులు ఇబ్బందులు పడుతుండగా.. విద్యార్థులకు సరైన సౌకర్యాలు లభించడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం వీటి పట్ల దృష్టిసారించి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తే అనేక మంది నిరుపేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విద్యార్థినిపై నుంచి వెళ్లిన పాఠశాల బస్సు

**- అక్కడికక్కడే చిన్నారి మృతి**
**- మేడ్చల్ మల్కాజిగిరి మల్లంపేట్ ఓక్ లీఫ్ హైస్కూల్‌లో ఘటన**



దుండిగల్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్లంపేట్‌లోని ఓ పాఠశాలలో తీవ్ర విషాద ఘటన జరిగింది. ఐదేండ్ల చిన్నారిపై నుంచి స్కూలు బస్సు వెళ్లడంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఓ కుటుంబం దుండిగల్ మున్సిపాల్టీలోని మల్లంపేట్‌లో డ్రీమ్ వ్యాలీలో నివసిస్తోంది. దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ మల్లంపేట్‌లో గల ఓక్ లీఫ్ హైస్కూల్‌లో చదువుతున్నారు. చిన్న కుమార్తె మహాన్విత(5) ఒకటో తరగతి చదువుతున్నది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఇద్దరు పిల్లలను స్కూల్ బస్సులో తల్లిదండ్రులు పంపించారు. అయితే, స్కూల్ ఆవరణలో బస్సు ప్రమాదవశాత్తు మహాన్వితపై నుంచి వెళ్లింది. వెంటనే ఆమెను మమత ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.అయితే, బస్సు నుంచి జారి పడి మహాన్విత మృతి చెందినట్టు స్కూల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. దాంతో వారు అక్కడకు చేరుకుని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు డ్రైవర్‌ను అక్కడి నుంచి పంపించేశారని.. కేసును తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని బంధువులు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. చిన్నారి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్కూల్‌కు బస్సు చేరుకోగానే పిల్లలను కిందకు దించి క్లాస్ రూమ్‌కు తరలించే క్రమంలో డ్రైవర్ చూసుకోకుండా నడపడం వల్ల ప్రమాదం జరిగిందా లేక బస్సులో నుంచి జారి పడి చిన్నారి మృతిచెందిందా అనేది తెలియరాలేదు.

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

**- త్వరలోనే తరలింపునకు చర్యలు : స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
**- రాంపూర్ గ్రామంలో పర్యటన**



ఎన్జీవోస్ కాలనీ: రాంపూర్‌లోని డంపింగ్ యార్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. హన్మకొండ జిల్లా రాంపూర్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి పలు సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్-కరీంనగర్ పట్టణానికి మధ్యలో ఉన్న నేషనల్ హైవే సమీపంలో 100 ఎకరాల స్థలాన్ని గుర్తించి ఈ డంపింగ్ యార్డును తరలించేందుకు ప్రయత్నాలు మొదలవుతున్నాయని చెప్పారు. రాంపూర్‌కు వచ్చే ప్రధాన రహదారిపై భారీ వర్షాల కారణంగా నీరు నిలిచిపోతున్నాయని, ఇంజనీరింగ్ అధికారులను పంపించి కాజ్ వే లేదా బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

రాంపూర్‌లో రెండు శ్మశానవాటికలను ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా గుడిసెలు వేసుకుని ఆక్రమించుకోకుండా చూస్తానని, త్వరలోనే తహసీల్దార్‌ని పంపించి అర్హులైన వారికి ఇండ్ల స్థలాల పట్టాలు ఇస్తామని తెలిపారు. కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి మిషన్ భగీరథ మంచినీటి సమస్య పరిష్కరిస్తారన్నారు. త్వరలో మున్సిపల్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలన్నీ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# 150 మందికి ఒకే టాయిలెట్లా..?

**- అదనంగా నిర్మించాలని అధికారులకు ఆదేశం**
**- ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి**



మద్దూరు: సిద్ధిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌ను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న సమస్యలను ప్రిన్సిపల్ సురేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యార్థుల వివరాలు, అధ్యాపకుల వివరాలను, మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. విద్యార్థులకు టాయిలెట్స్ లేకపోవడంతో వెంటనే నూతన టాయిలెట్స్ నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 150 మంది విద్యార్థులకు ఒకే టాయిలెట్ ఉండటం దురదృష్టకరమన్నారు. వెంటనే విద్యార్థుల కోసం రూ.13.80 లక్షలతో నూతన టాయిలెట్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సిద్దిపేట జిల్లా డీఐ ఈవో సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పిల్లల లైబ్రరీకి "ఎల్ఐసీ" కంప్యూటర్ల బహూకరణ

**- పిల్లల లైబ్రరీకి "ఎల్ఐసీ" కంప్యూటర్ల బహూకరణ**




హైదరాబాద్: తెలంగాణ బాలోత్సవం అధ్వర్యంలో పిల్లల లైబ్రరీకి ఎల్ఐసీ సంస్థ కంప్యూటర్లు ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీనియర్ డివిజన్ మేనేజర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్‌గా ప్రస్తుతం మారిన తరుణంలో పిల్లల్లో పఠనం ఒక జీవన విధానంగా మారాలని ఆకాంక్షించారు.ఇదే ఒరవడిలో బాలోత్సవం పుస్తకాలు దారిదీపాలుగా మారుస్తోందని అభివర్ణించారు. మనిషికి, అక్షరానికి విడదీయరాని సంబంధంఉందనీ, జీవితం నుంచి అక్షరాలను, వాటి నుంచి జీవితాన్ని వెతుక్కోవడం ఎప్పటి నుండో వస్తున్నదన్నారు. బాలలకు పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకో వడం హర్షణీయమన్నారు. కంప్యూటర్ యుగంలో.. పెద్దల నుండి పిన్నల దాకా పుస్తకాలు చదివే అలవాటు గణనీయంగా తగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే విజువల్ సంస్కృతి ప్రారంభమైందో అప్పుడే చదవ డం అలవాటు తగ్గిపోయిందన్నారు. ఈ తరుణంలో పిల్లల లైబ్రరీ నిర్వహిం చడం హర్షణీయమన్నారు. ఎల్ఐసీ మార్కెట్ మెనేజర్ యం ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఒక జాతి సంస్కతిని, నాగరికతను పది కాలాల పాటు పదిల పరిచే ఆలయం గ్రంథాలయమని చెప్పారు.విజ్ఞానం కావాలంటే విజ్ఞాన కేంద్రానికి రావాలి అన్నట్టు ఉందన్నారు.

కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెట్ సెల్స్ మెనేజర్ టి.రామచంద్రన్, ప్రొడక్ట్ మెనేజర్ రవీంద్ర మైథిలి, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి ఎన్ సోమయ్య ఉపాధ్యక్షులు కే సుజావతి,జి.బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# నిమజ్జనానికి కరెంటోళ్లు రెడీ

**- కంట్రోల్‌రూం ప్రారంభించిన సీఎమ్‌డీ**



హైదరాబాద్: గణేష్ విగ్రహాల శోభాయాత్రకు విద్యుత్ శాఖ సర్వసన్నద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఈ నెల 17న శోభాయాత్ర జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యాత్ర జరిగే మార్గంలో విద్యుత్‌కు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హుస్సేన్‌సాగర్ సమీపంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూంను శుక్రవారంనాడాయన ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా ఏర్పడే అదనపు విద్యుత్ లోడ్‌కు సరిపడేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు.

సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు తమ పరిధిలోని పెద్ద విగ్రహాలు ప్రతిష్టించిన మండపాలను, శోభాయాత్ర నిర్వహించే వీధుల్ని క్షుణ్ణంగా పరిశీలించి, రోడ్ క్రాసింగ్‌లు, వదులుగా ఉన్న తీగలు సరిచేయడం, ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర ఎర్తింగ్, ఇన్సులేషన్‌ల ఏర్పాటు, ఇనుప స్తంభాలు, ఫ్యూజ్ బాక్సులు వున్నచోట పీవీసీ పైపులు, ప్లాస్టిక్ షీట్ల ఏర్పాటు చేయడం వంటి పనులు పూర్తిచేశామన్నారు. సిబ్బంది, అధికారులు విద్యుత్ భద్రతపై దృష్టి పెట్టాలనీ, శోభాయాత్రలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పర్యవేక్షించడానికి డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లను ఇంచార్జిలుగా నియమించామన్నారు. ప్రజలు అత్యవసరంలో 100 / 1912 కు ఫోన్ చేయాలని సూచించారు.

# కూరగాయల విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలి..


**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు..**



వేములవాడ: వేములవాడ పట్టణంలోని కూరగాయల మార్కెట్ విక్రయదారుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి.రాములు అన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి వేములవాడ కూరగాయల వ్యాపారులతో పాటు,వేములవాడ చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం ఇక్కడికి వచ్చి కూరగాయలు అమ్ముతున్నారని ఎక్కువ మంది మహిళలు అమ్మకం దారులుగా ఉన్నారని,వారికి కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కొంత మేర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారని,కనీసం స్మశానవాటికలో గల టాయిలెట్స్ ను వాడుకుందామన్నా దానికి తాళం వేయడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కూరగాయల మార్కెట్టుకు కూడా విక్రయదారులే పందిర్లు వేసుకొని అమ్ముకుంటున్నారని,ఎలాంటి సౌకర్యం కల్పించని మున్సిపల్ వారు తై బజార్ రుసుము మాత్రం వసూలు చేస్తున్నారని,వీళ్ళ నుండి ఆదాయం వస్తున్నప్పుడు ఎందుకు సౌకర్యాలు కల్పించరని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ అజ్జ.వేణు,శాంతక్క, భారతవ్వ మల్లవ్వ, కూరగాయల వ్యాపారులు,మహిళా రైతులు తో పాటు తదితరులు ఉన్నారు.

# అక్రమంగా భూమీ రిజిస్ట్రేషన్..

**- బేధరింపులకు పల్పడిన నలుగురి పై కేసు నమోదు..**
**- కడారి తిరుపతి అరెస్ట్ - ముగ్గురు పరారి..**




వేములవాడ : అక్రమంగా 60 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేపించుకొని చంపుతా అని బెదిరించిన నలుగురి పై కేసు నమోదు , కడారి తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు, మిగతా ముగ్గురు పరారిలో ఉన్నట్లు శనివారం వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. వేములవాడ సాయి నగర్ కు చెందినటువంటి మెండ శంకరవ్వ అనే మహిళ తనకు డబ్బులు అవసరం ఉండగా చెక్కపల్లి రోడ్లో తనకు ఉన్నటువంటి 60 గుంటల వ్యవసాయ భూములో ఒక గుంటను పోగుల శ్రీనివాస్ అనే వ్యక్తికి అమ్మగా , పోగుల శ్రీనివాస్ ఒక గుంట కాకుండా 60 గుంటలు భూమిని తన పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ముత్యాల రమేష్ అనే వ్యక్తికి అమ్మినాడు అని తెలిపారు.శంకరవ్వ కోర్టులో కేసు వేయగా అది తెలుసుకొని కడారి తిరుపతి అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి చంపుతానని బెదిరించి తన చేత బలవంతంగా సంతకాలు తీసుకొని అతని తమ్ముడు అయిన కడారి మహేందర్ అను అతని పేరు మీద తన యొక్క 60 గుంటల భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకొని అందులో ప్లాట్లు చేసి ఇతరులకు అమ్ముచుండగా, శంకరవ్వ వెళ్లి ఈ విషయం గురించి నిలదీయగా నీకు భూమి ఎక్కడిది అని ఆమెను బెదిరించి, ఇక్కడికి వస్తే చంపుతానని బెదిరించినట్లు శంకరవ్వ వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. పోగుల శ్రీనివాస్,ముత్యాల రమేష్,కడారి తిరుపతి,కడారి మహేందర్ లపై కేసు నమోదు చేసి కడారి తిరుపతి అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని,మిగితా ముగ్గురు పరారిలో ఉన్నారని వేములవాడ పట్టణ సి.ఐ వీరప్రసాద్ అన్నారు. అక్రమంగా ఇతరుల భూములను రిజిస్ట్రేషన్ చేసుకొని బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ హెచ్చరించారు.

# పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకున్న ఎస్ఐ రవి

శంకరపట్నం: శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద స్థానిక ఎస్సై కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు చెక్ చేస్తుండగా టాటా ఎస్ ట్రాలీ ఏపీ 15 టి ఏ 1660 నెంబర్ గల వాహనాన్ని ఆపి చెక్ చేయగా అందులో రేషన్ బియ్యం వేసుకొని వస్తున్న డ్రైవర్ ప్రశ్నించగా తాడికల్ గ్రామానికి చెందిన నరాల అంకూస్ అని తెలిపారు.ప్రభుత్వం పేదప్రజలకు ఇచ్చిన రేషన్ బియ్యాన్ని తాను తక్కువ ధరకు కొని నేను బ్లాక్ మార్కెట్లో ఎక్కువదరకు అమ్ముతానని తెలిపాడు అందులో (38) బస్తాలు సుమా రుగా 19 క్వింటాల బియ్యం అక్రమంగా తరలిస్తుంటే పట్టుకొని పంచుల సమక్షంలో పంచనామాచేసి అట్టి వాహనంను కేశవపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించి సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అస్సాంలో ఆన్ లైన్ స్కామ్

గౌహాతి: అస్సాంలో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ కుంభకోణం తీవ్ర సంచలనంగా మారింది. పెట్టిన పెట్టుబడిని అతి త్వరలో రెట్టింపు చేస్తామని నమ్మించిన కొందరు మోసగాళ్లు.. ప్రజలను భారీగా స్టాక్‌మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తామని చెప్పి కోట్ల రూపాయలను సేకరించారు. 2నెలల్లో పెట్టిన పెట్టుబడిపై 30 శాతం లాభం వస్తుందని చెప్పి.. జనాన్ని నమ్మించారు. ఇక ఈ ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ కాస్తా.. అస్సాం సినిమా ఇండస్ట్రీలోకి వ్యాపించగా.. ఓ హీరోయిన్, ఆమె భర్తతోపాటు మరికొందరి పేర్లు కూడా ఈ కేసులో బయటికి వచ్చాయి. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ జరపగా.. వీరి పేర్లు బయటికి వచ్చాయి. దీంతో వారిని విచారణకు పిలిచినా రాకపోవడంతో తాజాగా అరెస్ట్ చేశారు. అస్సాం నటి సుమి బోరా, ఆమె భర్త తార్కిక్ బోరాను తాజాగా అస్సాం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. ఇక ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న విశాల్ ఫుకాన్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసిన పోలీసులు.. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగానే సుమి బోరా, తార్కిక్ బోరాలు విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు ఇచ్చినా.. వారు స్పందించలేదు. దీంతో వారిపై కోర్టు లుకౌట్ నోటీసులు జారీ చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే 60 రోజుల్లో 30 శాతం రాబడి వస్తుందని ప్రజలను నమ్మించి విశాల్ ఫుకాన్ కోట్ల రూపాయలను కూడబెట్టాడు. వాటితో 4 నకిలీ సంస్థలను ప్రారంభించి.. అస్సాం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టి భారీగా ఆస్తులను కూడబెట్టాడు. అస్సాంలో ఇటీవల రూ. 2 వేల కోట్ల కుంభకోణాన్ని పోలీసులు గుట్టు రట్టు చేశారు. స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరుతో భారీగా డబ్బులు సేకరించినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే అరెస్ట్‌కు ముందు సుమి బోరా ఓ వీడియోను రిలీజ్ చేశారు. తన పరువుకు నష్టం కలిగించేలా తన కుటుంబంపై వార్తలు వస్తుండటంతో తాను పోలీసుల ముందు లొంగిపోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కేసులో విచారణకు తాను సహకరించాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. తాము పరారీలో ఉన్నట్లు మీడియాలో వస్తున్న వార్తలు, తమకు ఎదురైన వేధింపుల కారణంగానే తాము దూరంగా ఉన్నట్లు చెప్పారు. అయితే తాము పారిపోయామని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆ వీడియోలో చెప్పారు. ఈ వీడియో విడుదల చేసిన తర్వాతి రోజే అస్సాం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. ఈ ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ స్కామ్ విలువ రూ. 22 వేల కోట్లు అని మొదట మీడియాలో రాగా.. ఆ తర్వాత ఆ మొత్తం రూ. 2వేల కోట్లు అని పేర్కొన్నాయి

# ప్రణతి షిండేతో రాహుల్ పెళ్లి....?

ముంబై: ఎవరైనా పెళ్లి చేసుకుంటున్నారంటే తోటి స్నేహితులకు, కుటుంబ సభ్యులకు చాలా ఆసక్తి ఉంటుంది. అమ్మాయి ఎవరు? ఎక్కడ ఉంటుంది? అనే వివరాల కోసం వెంటనే ఆరాధిస్తారు. అలాగే సినీ ఇండస్ట్రీకి చెందిన సెలబ్రెటీల పెళ్లి విషయం రాగానే వెంటనే వారు చేసుకోబోయేది ఎవరు? అని తెలుసుకునేందుకు ట్రై చేస్తారు. అయితే రాజకీయ నాయకుల పెళ్లిళ్ల గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ మోస్ట్ ఎల్జిబుల్ బ్యాచ్ లర్, కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ పెళ్లి విషయం అనగానే దేశ వ్యాప్తంగా చర్చ సాగుతూ ఉంటుంది. ఎందుకంటే దేశంలో ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్న రాహుల్ గాంధీ వయసు మీద పడుతున్నా పెళ్లి గురించి ఎవరైనా అడిగితే సమాధానం దాటవేస్తూ వస్తున్నారు. కానీ తాజాగా ఆయన గురించి ఓ ఆసక్తి కర చర్చ సాగుతోంది. త్వొందర్లోనే ఓ రాజకీయ నాయకుడి కూతురును వివాహం చేసుకోబోతున్నారన్న ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ జాతీయ నేత రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నాడు. ఒకప్పుడు ఆయన రాజకీయాల్లో పనికి రాడు అని అన్నవారు.. ఇప్పుడు ఆయన గురించి ప్రత్యేకంగా చర్చించుకుంటున్నారు. ఎందుకంటే ఎన్ని అడ్డంకులు, ఇబ్బందులు వచ్చినా కాంగ్రెస్ పార్టీని దేశ వ్యాప్తంగా తీసుకెళ్తూ కాపాడుతూ వస్తున్నాడు. అయితే ఇదే క్రమంలో రాహుల్ పెళ్లి ప్రస్తావన పై కూడా జోరుగా చర్చ సాగుతూ ఉంటుంది. తాను ప్రధాని అయిన తరువాతే పెళ్లి చేసుకుంటాడని రాహుల్ నిర్ణయం అని కొందరు అన్నారు. కానీ ఆ మధ్య లండన్ లో ఓ అమ్మాయితో కలిసి ఉన్న ఫొటోతో రకరకాలుగా ప్రచారం చేశారు. తాజాగా రాహుల్ ను ఓ అమ్మాయి పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రచారం జరగుతోంది. అయితే ఆమె ఎవరో కాదు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండె కుమార్తె. ఆమె పేరు ప్రణతి షిండే. ప్రస్తుతం షోలాపూర్ ఎస్సీ నియోజకవర్గం నుంచి ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న ఈమెతో కలిసి రాహుల్ జోడో యాత్రలో కలిసి కనిపించారు. అంతేకాకుండా ఎంపీగా గెలిచిన తరువాత ప్రణతి షిండే రాహుల్ ను స్వయంగా ఇంటికి ఆహ్వానించించారు కూడా. ఇదే కాకుండా మే 13న రాయబరేలిలో జరిగిన ర్యాలీలో ప్రణతి షిండేను కొందరు రాహుల్ ను పెళ్లి చేసుకుంటారా? అని ప్రశ్నలు కూడా వేశారు. దీంతో ఆ సమాధానం రాహుల్ ఇవ్వాలని చెప్పిందంట. దీంతో రాహుల్ ను పెళ్లి చేసుకునేందుకు ప్రణతి ఇష్టంగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. కానీ రాహుల్ నుంచి మాత్రం ఎటువంటి సమాధానం లేదు. కానీ ఈ ప్రచారం పై రాహుల్ ఎలా స్పందిస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే గత 20 నుంచి 30 ఏళ్లుగా రాహుల్ ఎవరిని పెళ్లి చేసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొందరు తండ్రి లాగే రాహుల్ విదేశీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటారని అన్నారు. మరికొందరు మాత్రం ఇండియన్ అమ్మాయినే పెళ్లాడుతారని చెప్పారు. మొత్తంగా రాహుల్ ఎవరిని పెళ్లి చేసుకుంటారో చూడాలి. ఒకవేళ రాహుల్ దీనిపై సానుకూలంగా స్పందిస్తారా? లేదా? అనేది ఆసక్తిగ మారింది.

# అగ్నిపథ్ లోనూ... రిజర్వేషన్లు

భువనేశ్వర్: త్రివిధ దళాల్లో చేరే సైనికులకు సంబంధించి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం దేశంలో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అగ్నిపథ్ పథకం కింద ఎంపికైన వారిని అగ్నివీరులుగా 4 ఏళ్ల పాటు సైన్యంలో పనిచేయించిన తర్వాత వారిని బయటకు పంపిస్తామని చెప్పడంతో యువతతోపాటు ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకంలో కొన్ని మార్పులను తీసుకువచ్చింది. మరోవైపు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాజీ అగ్నివీరులకు రిజర్వేషన్లు ప్రకటించారు. ఇక కొన్ని నెలల క్రితం ఒడిశాలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మాజీ అగ్నివీరులకు ఒడిశా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. యూనిఫామ్ సర్వీసుల్లోని గ్రూప్ సీ,డీ ఉద్యోగాల్లో నేరుగా నియామకాలు ఇచ్చేలా చేసిన ప్రతిపాదనకు ఒడిశా మంత్రివర్గం ఆమోదం కల్పించింది. ఒడిశాలో గ్రూప్ సీ, డీ ఉద్యోగాల్లో అగ్నివీరులుగా పనిచేసి రిటైర్ అయిన వారికి 10శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తూ మోహన్ మాఝి నేతృత్వంలోని ఒడిశా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఇక ఈ మాజీ అగ్నివీరులను యూనిఫామ్ సర్వీసుల్లోకి నేరుగా నియమించుకుంటామని పేర్కొంది. అయితే ఇప్పటివరకు అమల్లో ఉన్న ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటాకు అదనంగా ఈ అగ్నివీరులకు 10శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్లు చెప్పారు. సీఎం మోహన్ మాఝి నేతృత్వంలో సమావేశమైన కేబినెట్.. ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్స్ అగ్నివీర్ రూల్స్ 2024కు ఆమోదం కల్పించింది. దీని ప్రకారం ఒడిశాలోని పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖ, ఫైర్ డిపార్ట్‌మెంట్ లేదా ఇతర శాఖల్లో మాజీ అగ్నివీరులకు అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఈ యూనిఫామ్ సర్వీసుల్లో నియామకాల సందర్భంగా మాజీ అగ్నివీర్‌లు కచ్చితంగా కొన్ని అర్హతలను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. అగ్నివీరులకు ఫిజికల్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంటుందని.. దీంతోపాటు 3 ఏళ్ల సడలింపు లభిస్తుందని పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా అగ్నిపథ్‌కు సంబంధించి కీలక మార్పులు తీసుకుంది. మాజీ అగ్నివీరుల విషయంలో కేంద్ర పారామిలటరీ బలగాలైన సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్‌పీఎఫ్‌లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. భవిష్యత్తులో చేపట్టే కానిస్టేబుల్ నియామకాల్లో మాజీ అగ్నివీరులకు 10శాతం రిజర్వ్ చేస్తున్నట్టు జులైలోనే ప్రకటించింది. అగ్నిపథ్ పథకాన్ని జూన్ 2022న కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. 17 నుంచి 21 ఏళ్ల వయసు ఉన్న యువత మాత్రమే త్రివిధ దళాల్లో అగ్నివీర్‌లుగా విధులు నిర్వహించేందుకు అర్హులు అని కేంద్రం తెలిపింది. 4ఏళ్ల తర్వాత సర్వీస్ నుంచి తప్పుకున్న అగ్నివీర్‌లకు పింఛను సహా ఇతర సైనికులు అందుకునే సౌకర్యాలు ఏవీ కల్పించరు. వారిలో 25శాతం మందిని మాత్రమే మరో 15 ఏళ్ల పాటు రెగ్యులర్ సర్వీస్‌లోకి తీసుకుంటారు. దీంతో ఈ అగ్నిపథ్ పథకంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రిజర్వేషన్లు ప్రకటిస్తున్నాయి.

# పిల్లలు వద్దంటున్న రష్యన్స్...

మాస్కో: ఇప్పటి వరకు రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. రెండు వర్గాలుగా విడిపోయిన ప్రపంచ దేశాలు ఈ యుద్ధంలో పాల్గొన్నాయి. కొన్ని దేశాలు పరోక్షంగా మద్దతు తెలిపాయి. కొన్ని దేశాలు తటస్థంగా ఉన్నాయి. యుద్ధాల కారణంగా చాలా దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో మూడో ప్రపంచ యుద్ధం అంటేనే భయపడుతున్నాయి. అయినా సంపన్న దేశాలైన అమెరికా, రష్యా సైనిక చర్యల పేరిట యుద్ధాలు చేస్తున్నాయి. గతంలో అమెరికా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో తమ సైన్యాన్ని రంగంలోకి దింపి ఆ దేశాలను తమ అధీనంలోకి తెచ్చుకుంది. ఇక రెండేళ్లుగా రష్యా కూడా ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తోంది. మరోవైపు ఉక్రెయిన్‌కు అమెరికా సాయం అందిస్తోంది. దీంతో ఈ యుద్ధం సుధీర్ఘంగా సాగుతోంది. శక్తివంతమైన రష్యాను చిన్న దేశమైన ఉక్రెయిన్ అమెరికా సాయంతో దీటుగా ఎదుర్కొంటోంది. ఈ యుద్ధ ప్రభావంతో రెండువైపులా తీవ్ర నష్టం జరుగుతోంది. ఉక్రెయిన్ ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్నది. అయినా రష్యాకు తలొగ్గేది లేదంటున్నారు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ. ఇక ఉక్రెయిన్ కూడా రష్యాపై అమెరికా అందించిన ఆయుధాలతో దాడులు చేస్తోంది. ఫలితంగా రష్యావైపు కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. ఇది రష్యా వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. మానసికంగా ఆందోళనకు గురిచేస్తోంది. యుద్ధ ప్రభావంతో రష్యా అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. తాజాగా కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. రష్యాలో జనన? మరణాల్లో అంతరం భారీగా పెరుగుతున్నట్లు తాజాగా విడుదలైన అధికారిక డేటా వెల్లడించింది. ఇందులో వెల్లడించిన గణాంకాల ప్రకారం రష్యాలో ఈ ఏడాదిలో జూన్ వరకు 5,99,600 మంది పిల్లలు జన్మించారు. 2023 జూన్‌లో పోలిస్తే దాదాపు 16 వేల మంది పిల్లలు తక్కువగా పుట్టారు. 2024 జూన్‌లో లక్ష కంటే తక్కువ మంది శిశువులు జన్మించారు. దీంతో నవజాత శిశువుల సంఖ్య 6 శాతం తగ్గినట్లుగా ఇటీవల రష్యన్ మీడియా తెలిపింది. 1999 నుంచి జననాల రేటులో తగ్గుదల కనిపిస్తున్నట్లుగా నివేదిక పేర్కొంటోంది. ఇక 2024 జనవరి నుంచి జూన్ మధ్య 3,25,100 మరణాలు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే ఇవి 49 వేలు అధికమని పేర్కొంది. రష్యాకు వచ్చిన వలసదారుల జనాభా 20.1 శాతం ఉండటంతో ఈ క్షీణత కొంతవరకు భర్తీ అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. దేశంలో తక్కువ జననాలు నమోదవడాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఓ విపత్తుగా అభివర్ణించారు. ఇటీవల రష్యా దిగువ సభ డూమాలోని కుటుంబాల రక్షణ కమిటీ అధిపతి నినా ఒస్టానినా మాట్లాడుతూ జననాల రేటు తగ్గుదలపై ఆందోళన వ్యక్తంచేశారు. దీనికోసం 'ప్రత్యేక జనాభా ఆపరేషన్' చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జనన రేటు పెంచేందుకు సోవియట్ కాలంలో అమల్లో ఉన్న పథకాన్ని అధ్యక్షుడు పుతిన్ మళ్లీ పునరుద్ధరించారు. 10, అంతకంటే ఎక్కువమంది పిల్లల్ని కనే మహిళలకు మిలియన్ రూబెల్స్ (భారత కరెన్సీలో దాదాపు రూ. 13 లక్షలకు పైన) నజరానా, 'మదర్ హీరోయిన్' అవార్డును ఇస్తామని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. అయితే 10వ బిడ్డ మొదటి పుట్టినరోజు నాడు ఈ నగదు చెల్లిస్తామని పేర్కొంది. అప్పటికి మిగతా 9 మంది పిల్లలు జీవించి ఉండాలని షరతు పెట్టారు. ఈ అవార్డుకు సంబంధించి అప్పట్లో రష్యా మీడియాలో పలు కథనాలు వెలువరించాయి. అయినా జనాభాలో పెరుగుదల కనిపించకపోవడంతో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. రష్యా? ఉక్రెయిన్ యుద్ధం కారణంగా భారీగా సైనికులు, ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంతో జనన? మరణాల్లో అంతరం భారీగా పెరుగుతుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య మొదలు పెట్టిన నాటినుంచి వేలాది మంది క్రెమ్లిన్ సైనికులు మరణించినట్లు అంతర్జాతీయ అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు దాదాపు 15 వేల మంది రష్యా సైనికులు మృతిచెంది ఉంటారని అంచనా. అయితే రష్యా మాత్రం ఈ వార్తలను తోసిపుచ్చుతోంది.

# మరో చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్...

న్యూయార్క్: స్పేస్‌ఎక్స్ చరిత్ర సృష్టించింది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను నిర్వహించింది. 'పొలారిస్ డాన్' మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మంగళవారం నలుగురు నింగిలోకి వెళ్లారు. వారిలో ఒకరైన ప్రముఖ వ్యాపారవేత్త జేర్డ్ ఇస్సాక్‌మన్ గురువారం తొలుత క్యాప్సూల్ నుంచి బయటకు వచ్చి స్పేస్‌వాక్ నిర్వహించారు. ప్రొఫెషనల్ వ్యోమగాములు కాకుండా.. అంతరిక్షంలో స్పేస్‌వాక్ నిర్వహించిన తొలి వ్యక్తిగా ఇస్సాక్‌మన్ చరిత్ర సృష్టించారు. అనంతరం స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సారా గిల్లిస్ ఆయన్ను అనుసరించారు. అంతరిక్ష నడకను 30 నిమిషాల పాటు నిర్వహించారు. వీరికి రెండు గంటలు సమయం పట్టింది. స్పేస్‌వాక్ సందర్భంగా మస్క్ సంస్థ తయారుచేసిన స్పేస్‌సూట్‌ను వారు పరీక్షించారు. ఐసాక్‌మన్ అంతరిక్షంలో నడుస్తోన్న ఫొటోను మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భూమి నుంచి బయలుదేరిన 15 గంటల తర్వాత 1400.7 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొని పొలారిస్ డాన్ మిషన్ అరుదైన మైలురాయిని అందుకుంది. కాగా, 'అంతరిక్షం నుంచి తిరిగి వచ్చినప్పుడు మనందరికీ చాలా పని ఉంది, కానీ ఇక్కడ నుంచి భూమి ఖచ్చితంగా పరిపూర్ణ ప్రపంచంలా కనిపిస్తుంది' అని ఇస్సాక్‌మన్ వ్యాఖ్యానించారు. విజయవంతమైన ఈ మిషన్ నాసా వంటి ప్రభుత్వ ఏజెన్సీలకు చెందిన ప్రొఫెషనల్ వ్యోమగాములకు అంతరిక్ష ప్రయాణం ఇకపై ప్రత్యేకం కాదని నొక్కి చెబుతుంది. ఒకప్పుడు స్పేస్‌వాక్‌లో వ్యోమగాములను అంతరిక్షం శూన్యంలో సూట్‌ల మాత్రమే రక్షణ కల్పించేవి. వాణిజ్య మిషన్‌లలో భాగంగా స్పేస్‌ఎక్స్ చేపట్టి పొలారిస్ సిరీస్మూడు మిషన్లలో ఇది మొదటిది. అంగారక గ్రహానికి మానవులను పంపాలనే మస్క్ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇచ్చేలా సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక, తొలి వాణిజ్య స్పేస్‌వాక్ విజయవంతం కావడంపై నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం అంతరిక్ష వాణిజ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, చైతన్యవంతమైన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను నిర్మించాలనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని చేరుకోడానికి తోడ్పడుతుందని ఆయన అన్నారు

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు జాబితాలో శ్రీశైలం దేవస్థానం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు జాబితాలో శ్రీశైల దేవస్థానానికి స్థానంలండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు జాబితాలో శ్రీశైల దేవస్థానానికి స్థానం కల్పించబడింది. ఈ మేరక ఆ సంస్థ దక్షిణభారత ప్రాంతీయ విభాగపు సంయుక్త కార్యదర్శి డా. ఉల్లాజి ఇలియాజర్ సంబంధిత ధృవీకరణ పత్రాన్ని దేవస్థానానికి అందజేశారు. ఈ ధృవీకరణపత్ర కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేశారు.



కాగా శ్రీశైలక్షేత్ర ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, ప్రధానాలయ విస్తీర్ణం, ప్రధానాలయం చుట్టు గల అరుదైన శిల్పప్రాకారం, క్షేత్రంలోని ప్రాచీన కట్టడాలు మొదలైన అంశాల ఆధారంగా శ్రీశైల ఆలయాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు జాబితాలో చేర్చినట్లుగా ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొరు. పరిపాలనా కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ ధృవీకరణపత్ర అందజేత కార్యక్రమములో ముందుగా జ్యోతిప్రజ్వలన చేయబడింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో శ్రీశైలక్షేత్రానికి చోటు లభించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. శ్రీశైలక్షేత్ర ప్రత్యేకతల కారణంగా లండన్ వరల్డ్ రికార్డ్సు జాబితాలో ఆ సంస్థవారు శ్రీశైలాన్ని చేర్చినట్లుగా తెలుస్తోందన్నారు. అంతకు ముందు కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ప్రారంభ ప్రసంగం చేస్తూ శ్రీశైలక్షేత్ర ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్షేత్రం భూమండలానికి నాభిస్థానంగా పేరొందిందన్నారు. అదేవిధంగా శ్రీశైలక్షేత్రంలో పుణ్య తీర్థాలు, సహజ జలధారలు మొదలైనవన్నీ క్షేత్ర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు దక్షిణభారత ప్రాంతీయ విభాగపు సంయుక్త కార్యదర్శి డా. ఉల్లాజి ఇలియాజన్ మాట్లాడుతూ క్షేత్ర విశేషాలు, క్షేత్రంతో ముడిపడివున్న అరుదైన అంశాలు మొదలైనవాటి కారణంగా శ్రీశైలాలయాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు జాబితాలో చేర్చడం జరిగిందన్నారు.

కార్యక్రమములో పలువురు దేవస్థానం యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆసుపత్రి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

జగిత్యాల: :ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి రికార్డులను, పరిసరాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ సేవలు, ఐపీ సేవలు ,రికార్డ్స్ ల్యాబ్ రికార్డ్స్, ఐపీ, రికార్డ్స్ మెడికల్ ఫార్మసి , కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు, ఆసుపత్రిలో పేషెంట్లకు శుభ్రమైన త్రాగునీరు అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ మరియు ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తమై పేషెంట్లకు ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు.


అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తీసేయించాలని, పక్కనే ఉన్న నిరూపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ పై నీరు నిల్వ ఉన్నదని దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నదని వెంటనే శుభ్రం చేయించి శానిటేషన్ చేయించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసుధన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, ఎమ్మార్వో, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## మండల ప్రత్యేక అధికారి దోమ ఆదిరెడ్డి

కమాన్ పూర్: ఈనెల 16న జరిగే గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. కమాన్ పూర్ మండలం లోని గుండారం రిజర్వాయర్ లో ఈనెల 16న గణేష నిమజ్జనం చేసే ప్రదేశాన్ని మండల తహసిల్దార్ ఎం వాసంతి కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఎంపీడీవో జీ లలిత ఎంపీ ఓ కాట భాస్కర్ లతో కలిసి ప్రదేశాన్ని పరిశీలించారు. సింగరేణి వారు ఇచ్చే క్రేన్ ను ఏ ప్రదేశంలో నిలపాలో చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలని గజ ఈతగాళ్లను మాత్రమే నిమజ్జనానికి సహకారాలు తీసుకోవాలని అన్నారు. వేరే వ్యక్తులను క్రేన్ పైకి ఎక్కించకూడదని అన్నారు. సుమారు 100 గణేష్‌ల వరకు నిమజ్జనం జరుగుతుందని వివిధ శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏర్పాట్లు ఆదివారం సాయంత్రం వరకు చేయాలని గ్రామ కార్యదర్శి బచ్చల ప్రసాద్ మరియు గ్రామ కారోబార్ గ్రామ కారోబార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు తాజా మాజీ ఉపసర్పంచ్ రాచకొండ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



# ఖమ్మం వరద బాధితులకు కోరుట్ల న్యాయవాదుల విరాళం

కోరుట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా వరద ముంపుకు గురవ్వగా.. ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులైన వీధిన పడ్డారు.. త్రాగునీటి సౌకర్యం లేక చిన్న పిల్లలు సైతం కలుషితమైన నీరు త్రాగడం వల్ల అనేకమైన సమస్యలను ఎదుర్కొంటున్న దృశ్యాలను టీవీల ద్వారా వీక్షించి చలించి పోయిన కోరుట్ల బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాదులు ఇట్టి విపత్కర పరిస్థితిలో తమ వంతు సహాయం అందించి ఆదుకోవాలని ముందుకు వచ్చారు. ఈ మేరకు రూపాయలు 20 వేలు తలా కొంత సమకూర్చి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు, ద్వారా జూనియర్ సివిల్ జడ్జి కే. పావని కి అందజేశారు. ఇట్టి రూపాయలను మండల రెవెన్యూ అధికారికి అందజేసి బాధితులకు చేరేలా చూడాలని కోరారు.. వరద బాధితుల కోసం న్యాయవాదులు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులకు పలువురు అభినందించారు..

# గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు

**- ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం**

**- కీలక నిబంధనలు ప్రకటించిన హైదరాబాద్ సిటీ పోలీసులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 13: గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియా తో మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అన్ని శాఖల సమన్వయంతో గణేష్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

నిబంధనలు ఇవే..

గణేష్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహనానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ పోలీసులు ఎక్స్ వేదికగా కీలక ప్రకటన చేశారు.

ఒక గణేష్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుంది.

విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను అమర్చకూడదు.



నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌కు అనుమతి లేదు.

రంగులు చల్లుకునేందుకు కాన్ఫెట్టి తుపాకులను ఉపయోగించకూడదు.

విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులకు అనుమతి ఉండదు

రోడ్డుపై వాహనం వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదు

విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇతర వాహనాలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా మార్గంలో ఆపకూడదు.

అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు వాహనాల కదలికలు ఆధారపడి ఉంటాయి.

ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, కాల్పులు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు.

జెండాలు లేదా అలంకారాల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు.

వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్‌లను బాటసారులపై వేయకూడదు

ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించకూడదు. జనాలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.

ఊరేగింపు సమయంలో బాణాసంచా ఉపయోగించకూడదు.

పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించాలి.

ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

# నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి

**ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లోని రాజరాజేశ్వర వసతి గృహం లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కిరణ్ కరే తో కలసి రెవెన్యూ, పోలీస్ పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, మత్స్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి, కమిటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జనానికి భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల నుండి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు యంత్రాంగం సూచనలు పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం చేయడానికి రెండు పాయింట్లు అలాగే రెండు క్రేన్ లు ఏర్పాటు చేయడం జరిగిందని క్రేన్స్ ద్వారానే విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జిల్లా యంత్రాంగం నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతి ఉంటుందని భక్తులు సహకరించాలని సూచించారు. నిరంతర పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. పంచాయితీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా భక్తులకు త్రాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఏదేని సమస్య వచ్చినా విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

మేఘా సంస్థ ద్వారా రెండు జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గజ ఈత గాళ్ళు లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రహదారులపై గుంతలు ఎర్పడ్డాయని మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని తెలిపారు.మరుగుదొడ్లు గుర్తించే విధంగా సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏదేని సమస్య వస్తే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. 9 రోజుల పాటు నైవేద్యాలు అందుకున్న వినాయకుడు గంగమ్మ వడికి చేరుతున్నాడని ఎలాంటి అపశ్రుతులకు అవకాశం లేకుండా భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లు పర్యవేక్షణ కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ

పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గాలలో పటిష్ఠ మైన నిఘా ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని, 24 గంటలు పనిచేయు విధంగా అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలతోపాటు వైద్య శిబిరాలు అభినందనీయం..

**ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్..**

రాజన్న సిరిసిల్ల: పోలీసుల ఆద్వర్యంలో శాంతి భద్రతల సేవలు అందించడంతో పాటు వైద్య శిబిరాలు అభినందనీయమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొనియాడారు.రుద్రంగి మండలం మానాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య శాఖ,అశ్విని హాస్పిటల్ రెనే హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రారంభించారు.ఉచిత మెగా వైద్య శిబిరానికి రుద్రంగి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజల నుండి వచ్చిన సుమారు 800 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. మారుమూల గ్రామ ప్రజలకు మేము ఉన్నాం అంటూ భరోసా కల్పిస్తూ వారికి సత్వర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అభినందనియమని కొనియాడారు.

గ్రామాలు ఆరోగ్యం ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని, మారుముల ప్రాంతమైన మానాల చుట్టూ ప్రక్కల గ్రామాలకు గతంలో ఏదైనా సమస్య తలెత్తుతే ఒకక్కారు ఇద్దరు తప్ప ఎవరు రని పరిస్థితి నుండి ప్రస్తుతం మేము ఉన్నాం అంటూ మానాల చుట్టుపక్కల గ్రామాలు భరోసా జిల్లా అధికార యంత్రాంగం కల్పించిందని వివరించారు.పోలీస్ శాఖ అనగానే శాంతి భద్రతల పరిరక్షణ ఒక్కటే తప్ప ఇతరత్రా సమస్యలు దూరంగా ఉంటుందని అనే ముద్ర నుండి సామాజిక రుగ్మతలు రూపుమముతూ ఏదైనా సమస్యలు తలెత్తుతే మేము ఉన్నాం అంటూ సామాజిక సేవకులు అందిస్తు జిల్లా ప్రజలకు భరోసా కల్పిస్తున్న జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలోని జిల్లా పోలీస్ యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మానాల గ్రామంతో చిన్నప్పటి నుండి మంచి అనుబంధం ఉందని, మానాల చుట్టూ ప్రజల సమస్యలు పరిష్కారంలో బాగంగా ఇక్కడ ఉన్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచక్కటి నిర్ణయమని వివరించారు.త్వరలో రుద్రంగి మండల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని,ప్రభుత్వ ఉచిత వైద్యం ,విద్య అనే లక్ష్యంతో ముందుకు వెళ్తుందన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు.ష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మాట్లాడుతూ.

మారుమూల ప్రాంతం అయిన మానాల చుట్టూ ప్రక్కల ప్రజల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంగా ఉండటానికి మధ్యపానానికి దూరంగా ఉండాలని, ఈ ప్రాంతంలోని ప్రజలకు రక్తహీనత సమస్యలు ఉన్నాయని వాటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించాలన్నారు. అవసరమైతే కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రికి పంపి ఉచిత వైద్య సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు.

కమ్యూనిటీ పోలీసింగ్ లో మీ కోసం కార్యక్రమంలో భాగంగా మానాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామాల్లో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పిల్లల నడవడిక తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, గంజాయి కి అలవాటు పడిన వారిని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డి ఆడిక్షన్ సెంటర్ కి పంపించాలని సూచించారు.

ఇక్కడ డీఎంహెచ్ఓ వసంతరావు, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎస్ఐలు, డాక్టర్లు ఉన్నారు.

# పార్టీ ఫిరాయింపుల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే...

**- వీధి రౌడీల్లాగ పరస్పర దాడులు సరికాదు...**

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్రిపెల్లి సత్యమ్..**

జగిత్యాల: :తెలంగాణా రాష్ట్ర రాజకీయాలను చూసి ప్రజలు అసహ్యం వ్యక్తం చేస్తున్నారని పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలు దొందూ దొందేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్రిపెల్లి సత్యమ్ ఎద్దేవా చేశారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షం లేకుండా చేయాలని పన్నెండు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లాగ కొనుగోలు చేసి కొందరికిఏకంగా మంత్రి పదవులు ఇచ్చిందని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తామేమి తక్కువ తినలేదని బిఆరెస్ పార్టీ ఎమ్మెల్యేలకు పదవుల ఆశజూపి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ పార్టీలో చేర్చుకుంటుందని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రెండు ఒకే నాణేనికి బొమ్మ బొరుసు లాంటివని అన్నారు.గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ నిర్ణయం తీసుకున్న ప్రతిపక్ష పార్టీ హోదాలో మల్లు భట్టి విక్రమార్క ఏరోజు ఖండించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వానికి వత్తాసు పలికారని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న ఈటెల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరినప్పుడు వారి శాసనసభ సభ్యత్వానికి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశాకే బీజేపీ రాజకీయ నైతిక విలువలకు కట్టుబడి బీజేపీలో చేర్చుకుందని అన్నారు. ప్రతిఒక్కరికి వారికీ ఇష్టమైన పార్టీలో చేరే హక్కు ఉందని కానీ ఒక పార్టీ గుర్తు మీద గెలిచి కేవలం పదవుల కోసం ఇంకొక పార్టీలో చేరడం రాజకీయ నైతిక విలువలను తుంగలో తొక్కడమేనని వారిని గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని అన్నారు. ఏది ఏమైనా రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం నడుచుకోవాలన్నారు. కానీ నిన్న జరిగిన పాడి కౌశిక్ రెడ్డి, అరికేపూడి గాంధీలు చట్టసభల్లో సభ్యులం అనే విషయం మరచిపోయి వీధి రౌడీల్లాగ పరస్పరం చేసుకున్న దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. ఇలాంటి దాడుల వల్ల మిమ్మల్ని నమ్ముకొని గెలిపించిన ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటని మీరు మాట్లాడే భాష వల్ల తేనేలొలుకు తెలుగు భాష సిగ్గు పడుతోందని అన్నారు.ప్రజాస్వామ్యం పరిరక్షిం చబడాలంటే ఒక పార్టీ గుర్తు మీద గెలిచి ఇంకొక పార్టీలోకి మారితే వారి శాసనసభ్యత్వాన్ని రద్దు చేసివారిని గెలిపించిన ప్రజల మనోభా వాలను కాపాడాలని కోరారు.

# పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కరీంనగర్: గణేష్ నిమజ్జనోత్సవం... మిలాద్ ఉన్ నబి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం మిలాద్ ఉల్ నబీ పండుగల నేపథ్యంలో శాంతి కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అధికారులకు, పోలీసులకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. పండుగల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అపశ్రుతులు తావులేకుండా ఆనందోత్సాహాల నడుమ భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం మిలాద్ ఉన్ నబి వేడుకలు ను జరుపుకోవాలని కోరారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని, పరస్పర సహకారంతో గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. నిమజ్జన ఉత్సవం సాఫీగా జరిగేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి అని అన్నారు. శాంతి కమిటీ సభ్యులు పరస్పరం సహకరించుకోవడం అభినందించ దగ్గ విషయం అన్నారు.

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పరస్పర సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్,ట్రైని కలెక్టర్ అజయ్ యాదవ్, డి ఆర్ డి ఓ, పవన్ కుమార్ ఆర్డీవో మహేశ్వర్, శాంతి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో సహజంగానే బీఆర్ఎస్ నేతలు అధికార పార్టీవైపు చూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మరో ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై గులాబీ నేతలు స్పీకర్‌పై ఫిర్యాదు చేశారు. తర్వాత కోర్టులో పటిషన్ వేశారు. విచారణ జరిపిన హైకోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నెల రోజుల్లో విచారణ ప్రారంభించాలని అసెంబ్లీ సెక్రెటరీని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

ఈ క్రమంలో స్పీకర్ పీఏసీ చైర్మన్, సభ్యులను నియమించారు. చైర్మన్ పదవిని పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఇవ్వడం మరింత చర్చనీయాంశమైంది.ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహం అనుసరిస్తోందా? అందులో భాగమే అరికపూడి గాంధీ పీఏసీ చైర్మన్ ఎంపికా? ప్రతిపక్ష ఎమ్మెల్యేగా పరిగణించి ఎంపిక చేసినట్టు స్పీకర్ చేసిన ప్రకటన దేనికి సంకేతం? మిగతా 9 మందిని అలాగే ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా పరిగణిస్తారా? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ. కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో నాలుగు వారాల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో సర్వత్రా ఇదే చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికపూడి గాంధీ ఎంపిక నిర్ణయం రాజకీయ సంచలనం సృష్టించింది. అసలు స్పీకర్ ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారు.. దీని వెనుక ఉన్న పొలిటికల్ ఈక్వేషన్ ఏంటా అని ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి స్పీకర్ తీసుకోబోయే నిర్ణయానికి ఏమైనా లింక్ ఉందా అన్న చర్చ కూడా ఉంది.కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నట్టు సమాచారం. వివిధ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలపై అనర్హత కేసులను స్టడీ చేసినట్టు తెలుస్తోంది. అయితే వ్యూహాత్మకంగా ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ ఎంపిక సాగినట్టు తెలుస్తోంది. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చాలా అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 10 మంది బీఆర్ఎ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరారు. అందులో అరికపూడి గాంధీ ఒకరు. పీఏసీ చైర్మన్ గా ఎన్నికైన అరికపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఐతే మరి మిగితా 9 మంది తొమ్మిది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వాళ్ల.. లేక కాంగ్రెస్ వాళ్లా అనేది ఇప్పుడు జరుగుతున్న చర్చ. ఈ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతారా.. అనే సందేహం అందరిలో మెదులుతుంది. అయితే సడన్‌గా ఎమ్మెల్యేలు ఇలా స్టాండ్. మార్చడానికి ఒక బలమైన కారణం లేకపోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యేల అనర్హత అంశం నెల రోజుల్లో స్పీకర్ ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఈ పరిణామం కాస్తా రాజకీయంగా ప్రకంపనలు రేపుతుంది. అంటే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యలను అనర్హత నుంచి బయటపడేసేందుకే కాంగ్రెస్ ఈ వ్యూహం అమలు చేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కారు పార్టీలో ఆగని కలహాలు

హైదరాబాద్: బీఆర్ఎస్‌లో నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు ముదిరి పాకాన పడ్డాయా? ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు క్రమంగా జారుకుంటున్నారా? అంతర్గత కలహాలతో నేతలు వీధిన పడ్డారా? నేతల మధ్య చిచ్చుపెట్టిందెవరు? బీఆర్ఎస్ కీలక నేతలా? లేక అంతర్గత కలహాలా ఇవే ప్రశ్నలు తెలంగాణ ప్రజలను వెంటాడుతున్నాయి.కారు పార్టీలో అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరాయి. నేతల వ్యవహారశైలి నచ్చక నేతలు ఒకొక్కరుగా కారు దిగిపోతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు.. గులాబీ పార్టీపై కాసింత ఆగ్రహంగా ఉన్నట్లు కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో భాగమే ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ-కౌశిక్‌రెడ్డి వ్యవహారం. ఇరువురు నేతల మధ్య మాటలు మరింత ముదిరి పాకానపడ్డాయి. నేతల సవాళ్లతో తెలంగాణ లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.మీ ఇంటికి వస్తానని ఒకరంటే.. నేనే మీ ఇంటికి వస్తానంటూ ఒకరిపై మరొకరు ఛాలెంజ్ విసిరారు. తాజా పరిస్థితులను గమనించిన పోలీసులు ఉదయం నుంచే కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద భారీగా పోలీసులు మొహరించారు. ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో మీడియాతో మాట్లాడిన ఇరువురు నేతలు.. వ్యక్తిగత అంశాలను బయట పెట్టుకున్నారు. ఎవరు బ్రోకరో ప్రజలందరికీ తెలుసంటూ ఇరువురు నేతల మధ్య మాటల రచ్చ సాగింది.ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైలెంట్‌గా ఉండటాన్ని పలువురు నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మౌనం వెనుక కారణమేంటి? వీరికి తెలిసే ఈ రచ్చ జరుగుతుందా? లేక తెర వెనుక నుంచి చేయిస్తున్నారా? అన్న ప్రశ్నలు రైజ్ అవుతున్నాయి.నార్మల్‌గా అయితే ఆ తరహా రచ్చ ప్రాంతీయ పార్టీల్లో పెద్దగా ఉండదన్నది కొందరి నేతల మాట. ఈ విధంగా ఏ పార్టీలోనూ చూడలేదని అంటున్నారు. బహుశా.. గులాబీ కీలక నేతల వ్యవహారశైలే దీనికి కారణమన్న వాదనలూ లేకపోలేదు. ఇన్నాళ్లు గుట్టుగా వ్యవహరించిన కారు పార్టీ.. పరువు పోతున్నా, ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు? బీఆర్ఎస్‌లో ఇలాంటి కలహాలు వీరితో ఆగుతాయా? ఇంకా కంటిన్యూ అవుతుందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

# నేడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి: పెద్దపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పలువురు ప్రజా ప్రతినిధులు పర్యటించి నియోజకవర్గంలో పలు మండలాలతోపాటు పెద్దపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి శనివారం రానున్నారని ఎమ్మెల్యే చింత కుంట విజయరామణారావు తెలిపారు. ఆయన సందర్భంగా స్థల ఏర్పాట్లను అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో 132/33 కె.వి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన, పెద్దపల్లి పట్టణంలో వ్యవసాయ మార్కెట్లో విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన అలాగే పెద్దపల్లి ఎస్టి కాలనీలో భూమి పూజ అనంతరం పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్, రంగాపూర్ గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో పలు అభివృద్ధి పనులతో పాటు అమృత్ 2.0 కింద త్రాగు నీటి పథకం టియూఎఫ్ ఐడీసీ కింద పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పలువురు మంత్రులు శంకుస్థాపనలు చేస్తారన్నారు అనంతరం పెద్దపల్లి జెండా చౌరస్తా దగ్గర జరిగే పబ్లిక్ మీటింగ్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రానున్న రోజుల్లో జిల్లా మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పెద్దపల్లి బైపాస్ రోడ్డు, బస్సు డిపో ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రుల పర్యటనలను నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, ప్రజలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పోకిరిలపై పోక్సో కేసులు

హైదరాబాద్: హైదరాబాదులో బాలికల పరిస్థితి బాధాకరంగా మారింది. పలు సందర్భాల్లో బాలికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపల స్పష్టంగా కనిపిస్తుంది. దీని తదనంతరం తన సందర్భాల్లో బాలికలు సైతం కొందరు పోకిరిల వలకు చిక్కుతున్నారు. హైదరాబాదులో నమోదు అవుతున్న పోక్సో కేసులు భయాందోళన కలిగిస్తున్నాయి.. ఏడాది వ్యవధిలో చోటు చేసుకున్న కేసుల సంఖ్య కంటే ఏడాది ఎనిమిది నెలల్లో చోటు చేసుకున్న కేసుల సంఖ్య అధికంగా కావటమే ఇనీదుకు కారణం. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజు బాలికలు మోసపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 71 పోలీస్ స్టేషన్లో ఉన్నాయి. వీటిలో ప్రతిరోజు ఇలాంటి ఫిర్యాదులు లేదా ఈ తరహా కేసులు వస్తూనే ఉన్నాయి. ప్రతిరోజు ఒకటి లేదా రెండు కేసులు నమోదవుతున్నాయి. బాలికలను వంచించి మోసం చేస్తున్న వారిపై ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. 2023లో ఇలాంటి మొత్తం 377 కేసులు నమోదుకాగా ఈఏడాది ఇప్పటి ఆగస్టు వరకు సుమారు 500 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఇక్కడ ఏడాది మొత్తంలో నమోదైన కేసుల సంఖ్య 377. 2022లో నమోదైన కేసుల సంఖ్య 428 . ఇలా గతంతో పోలిస్తే ఏడాది ఎనిమిది నెలల వ్యవధిలోనే అత్యధిక కేసులు నమోదు కావటం విశేషం. మోసపోతున్న చిన్నారుల సంఖ్యలో అధికంగా 12 నుంచి 15 వయసు గల బాలికలు బాధితులుగా ఉంటున్నారు. మరోవైపు బాలికలను ట్రాప్ చేసి మోసం చేస్తున్న నిందితుల సంఖ్య సగటున 25 నుంచి 35 వయసుగల యువకులు ఉంటున్నారు. ప్రతి ఏటా 400కు పైగా ఫోక్సో కేసులు నమోదు అవుతున్నాయి. వీరిలో అధిక శాతం బాలికలను మాయమాటలు చెప్పి మోసం చేసి మభ్య పెట్టే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. బాలికలు కూడా ఈజీగా వారి ట్రాప్ లో పడి వారి మాటలు నమ్మి వారితో కలిసి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు ఆ తర్వాత మోసపోయామని గ్రహిస్తున్నారు. దాదాపు 80 శాతానికి పైగా కేసుల్లో నిందితులు బాలికలను మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్న వారే. మరోవైపు తల్లిదండ్రులకు సైతం పోలీసులు సూచనలు చేస్తున్నారు. తో పిల్లల పట్ల తల్లిదండ్రులు తప్పనిసరి శ్రద్ధ వహించాల్సిందే అని లేనిపక్షంలో ఇలాంటి దారుణాలు జరుగుతూ ఉంటాయని పోలీసులు చెబుతున్నారు.

# టెన్త్ పరీక్షలపై రాని క్లారిటీ

హైదరాబాద్: ఓవైపు పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నాయి. మరోవైపు పరీక్షల విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు టెన్షన్ పడుతున్నారు. పరీక్షలు ఏ ఫార్మాట్‌లో ఉంటాయి.. విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలని టీచర్లు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నాపత్రం సరళి ఎలా ఉంటుందో తెలియక.. ఇటు ఉపాధ్యాయులు.. అటు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంటుందని టీచర్లు వివరిస్తున్నారు. పాఠశాల స్థాయిలో కూడా పరీక్షలు నిర్వహించాలని చెబుతున్నారు. గతంలో ఆరు సబ్జెక్టులకు గానూ.. 11 పేపర్లు ఉండేవి. ఒక్క హిందీ మినహా.. మిగిలిన అన్నింటికి రెండేసి పేపర్లు ఉండేవి. పరీక్షలు 11 రోజులు జరిగేవి. దీని కారణంగా విద్యార్థుల పై ఒత్తిడి పెరుగుతోందని భావించిన ప్రభుత్వం.. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో పేపర్ మాత్రమే ఉండేలా నిర్ణయం తీసుకుంది. దీంతో పరీక్షలు ఆరు రోజుల్లో ముగిసేవి. అయితే.. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో పేపర్ ఉండేలా తీసుకున్న నిర్ణయం పర్మినెంట్ కాదు. కేవలం 2022- 23, 2023 -24 విద్యా సంవత్సరానికి మాత్రమేనని ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎలా పరీక్షలు నిర్వహించాలన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. గత విధానాన్నే కొనసాగిస్తారా.. కొత్త విధానాన్ని ప్రవేశపెడతారా అన్న అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉందిప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్ణయం తీసుకోవాలని.. ఎస్సీఈఆర్టీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వారు ప్రతిపాదనలు పంపి నెల రోజులు కావొస్తున్నా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో విద్యార్థులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అయోమయంలో ఉన్నారు. ప్రభుత్వం నిర్ణయం చెబితే.. దాని ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేస్తామని చెబుతున్నారు. గతేడాది వరకూ.. వ్యాసరూప ప్రశ్నం 6 ఇచ్చేవారు. వాటిల్లో నాలుగింటికి సమాధానాలు రాయాలి. వాటికి 24 మార్కులు ఉండేవి. లఘు ప్రశ్నలు 6 ఉండేవి. ఆరింటికి సమాధానం రాయాలి. వాటికి 24 మార్కులు ఉండేవి. షార్ట్ క్వశ్చన్స్ కూడా 66 ఉండేవి. ఆరింటికి సమాధానాలు రాయాలి. వాటికి 12 మార్కులు ఉండేవి. మల్టిపుల్ ఛాయిస్ కింద 20 ప్రశ్నలు అడిగేవారు. వాటికి ఒక్కో మార్కు చొప్పున 20 మార్కులు ఉండేవి. మొత్తం 80 మార్కులకు ప్రశ్నాపత్రం ఉండేది. అయితే.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ఎలాంటి పేపర్‌ను డిజైన్ చేస్తుందో తెలియడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగానే గందరగోళ పరిస్థితి నెలకొందని అంటున్నారు. ప్రభుత్వం తొందరగా నిర్ణయం ప్రకటిస్తే.. దానికి తగ్గట్టు విద్యార్థులను సన్నద్ధం చేయొచ్చని చెబుతున్నారు.

# 2019కి ముందు... తర్వాత

**కమలంలో గ్రూపులు... వర్గాలు**

హైదరాబాద్: తెలంగాణ బీజేపీలో నేతల మధ్య భేదాభిప్రాయాలు తీవ్రమవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఎంతో క్రమశిక్షణ గల కమలం పార్టీని ప్రస్తుతం రెండుగా విభజించి చెబుతున్నారు. 2019కి ముందు 2019 తరువాత బీజేపీ అంటూ పార్టీని రెండుగా విభజిస్తున్నారు. కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాతే తెలంగాణలో ఆ పార్టీ బలోపేతమవుతూ వచ్చింది. 2019లో తెలంగాణ నుంచి నాలుగు ఎంపీలు గెలవడంతో కమలం పార్టీలో చేరికలు ఎక్కువయ్యాయి. ఇక ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఉండగా చేసిన ప్రజా సంగ్రామ యాత్ర ద్వారా పార్టీలో చేరికలు మరింతగా పెరిగాయని చెబుతారు. ఇలా పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చాక గతం ఒక తీపి జ్ఞాపకంగానే మిగిలిపోతుందనే టాక్ వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలో ప్రారంభమైన విభేదాలు? ఇప్పటికీ సమసిపోలేదని తాజా ఉదంతాలు రుజువు చేస్తున్నాయి. ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన నేతల్లో కొందరు తమకు సరైన గౌరవం దక్కడం లేదని నిత్యం అసంతృప్తితో రగిలిపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డికి తగిన ప్రొటోకాల్ ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారుఇటీవల వరద ప్రాంతాల బాధితులను పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సూచన మేరకు రెండు బృందాలను నియమించారు. ఇందులో ఒక బృందం కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో ఖమ్మంలో పర్యటించగా, మరొకటి ఎంపీ ఈటల రాజేందర్ నేతృత్వంలో మహబూబాబాద్ వెళ్లింది. అయితే ఈటెల బృందంలో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డిని సభ్యుడిగా పెట్టడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారట. ఒక బృందాన్ని నియమిస్తే బీజేపీ ఎల్పీ నేతగా తాను నేతృత్వం వహించాలని లేదంటే తనను పూర్తిగా మినహాయించాలి కానీ సాధారణ బృంద సభ్యుడిగా ఎలా నియమిస్తారని పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు మహేశ్వర్‌రెడ్డి. తనను చిన్నచూపు చూస్తున్నారని భావించిన బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వరద ప్రాంతాల పర్యటనకు దూరంగా ఉన్నట్లు చెబుతున్నారు కొనసాగుతుండగానే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఓ ప్రైవేటు హోటల్ లో అట్టహాసంగా చేపట్టారు కమలనాథులు. ఈ కార్యక్రమానికి కనీసం బీజేఎల్పీ నేతను ఆహ్వానించలేదన్న వార్త గుప్పు మంటోంది. మీడియాకు పంపించిన ఇన్విటేషన్ లో కేంద్ర మంత్రులు, ఎంపీల పేర్లు పెట్టినా బీజేఎల్పీ నేత పేరు పెట్టలేదట. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను పిలిచి ఎల్పీ లీడర్‌ను ఆహ్వానించకపోవడమేంటని మహేశ్వర్‌రెడ్డి అనుచరులు నొచ్చుకుంటున్నారని చెబుతున్నారు. ఇవి ఈ వారం రోజుల్లో జరిగిన సంఘటనలని.. గతంలో కూడా ఇలాంటి సంఘటలను చాలా ఉన్నాయని అంటున్నారు. ఎల్పీ నేతకి పార్టీ సమావేశాలలో వేదికపైకి ఆహ్వానించడం లేదని, పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా గది ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది. చివరికి పార్టీ బ్యానర్లలో మహేశ్వర్‌రెడ్డి ఫొటో కూడా వేయడం లేదని ఆయన అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా బీజేపీ ఎల్పీ లీడర్‌కు ఇచ్చే మర్యాద? అంటూ మహేశ్వర్‌రెడ్డి కూడా ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే మహేశ్వర్‌రెడ్డి బాధపై పార్టీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. సిద్ధాంతాలు, పార్టీ విధానాలు తెలియకుండా బీజేపీలో చేరిన వారితోనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యమైన పదవులు ఇచ్చినా సంతృప్తి చెందడం లేదని, త్యాగాలు చేసి వారికి పదవులు కట్టబెడితే వారిలో సంతృప్తి ఉంటుందని.. పార్టీ లైన్ తెలియని వారే ఇలాంటి వాదనలు తెరపైకి తెస్తున్నారని మహేశ్వర్‌రెడ్డి ఆవేదనను కొట్టిపడేస్తున్నారు బీజేపీ సీనియర్ నేతలు. మొత్తానికి ఈ వ్యవహారం పరిశీలిస్తే బీజేపీలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం ఇప్పటికీ కుదరడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# నిమజ్జనం తర్వాత కేబినెట్...విస్తరణ కు క్లియరెన్స్...

హైదరాబాద్: రేవంత్ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందా? లేక మరింత ఆలస్యం కానుందా? తెలంగాణలోని కాంగ్రెస్ కీలక నేతలకు ఢిల్లీకి వెళ్లడం వెనుక అసలేం జరుగుతోంది? అధిష్టానం నుంచి సంకేతాలు వచ్చాయా? మంత్రి విస్తరణతోపాటు పార్టీ పదవులు ఓ కొలిక్కి వచ్చేనా? అవుననే సంకేతాలు ఆ పార్టీ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. తెలంగాణ కేబినెట్‌లో ఇంకా ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ఇటు మంత్రి పదవులు, అటు పీసీసీ పదవుల కోసం పలువురు నేతలు క్యూలో కనిపిస్తున్నారు. ఎవరి స్థాయిలో వారు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఆ క్రమంలో అతి త్వరలోనే ఆ లాంఛనం పూర్తవుతుందన్న టాక్ బలంగా వినిపిస్తుందిపీసీసీ కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ త్వరలో నిర్ణయం తీసుకోనుందని తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో జోరుగా చర్చ జరుగుతోంది ? ఇదే విషయమై ఢిల్లీ పెద్దలతో చర్చించి, తమ అభిప్రాయాలను పంచుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్ వంటి నేతలు ఢిల్లీకి వెళ్లారు. ఇదిలావుండగా కొన్ని మంత్రి పదవులు, ఉప సభాపతి, చీఫ్ విప్.. ఇలా అన్ని పదవుల నియామకాల్లోనూ సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని గతంలో ఒక నిర్ణయానికి వచ్చారు. పీసీసీ అధ్యక్ష పదవిని బీసీ నేతకు ఇచ్చారు. కార్యనిర్వాహక అధ్యక్షులు, ప్రచార కమిటీ ఛైర్మన్ పదవులను ఇతర సామాజిక వర్గాలకు ఇచ్చే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణపైనా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సమాచారం. కొత్తగా మరో ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకొనేందుకు అవకాశముంది. వాటిలో ఒకట్రెండు పెండింగ్‌లో పెట్టి మిగిలినవి భర్తీ చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సామాజికవర్గం లెక్కలతో వాకిటి శ్రీహరి ముదిరాజ్, పి.సుదర్శన్‌రెడ్డి, గడ్డం వివేక్‌లకు అవకాశం ఉండొచ్చని తెలుస్తోంది. మరోవైపు ఎన్నికలకు ముందు పార్టీలో చేరే సమయంలోనే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలోకి తీసుకుంటామనే హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు .. ఆయనకూ అవకాశం ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ లేనందున ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డిలలో ఒకరికి అవకాశం ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా మైనార్టీల నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్, ఎమ్మెల్సీ స్థానాల భర్తీ, పిసిసి చీఫ్ నియామకం పూర్తవ్వడంతో ప్రస్తుతం అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే పడింది. డిసెంబర్ 7న సిఎం రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఇంకా ఆరు కేబినెట్ బెర్తులు ఖాళీగా ఉన్నాయి. హోం మంత్రిత్వశాఖ, మున్సిపల్, విద్య, మైనింగ్‌తో పాటు పలు కీలక శాఖలు సిఎం వద్దే ఉన్నాయి. కేబినెట్ విస్తరణలో పలువురు సీనియర్ మంత్రి పదవులు ఆశిస్తున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. షబ్బీర్‌అలీ, అజారుద్దీన్‌ల పేర్లు కొత్తగా తెరపైకి వస్తున్నాయి. వారిద్దరిలో ఎవరిని మంత్రి పదవి వరించినా, ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాల్సి ఉంటుంది. మరి కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్‌రెడ్డిల ఈక్వేషన్లు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

గుర్రు గుర్రుగా మధు యాష్కీతెలంగాణ పీసీసీ అధ్యక్ష పదవిపై గంపెడన్ని ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత మధు యాష్కీ గౌడ్‌కు నిరాశే ఎదురైంది. కొత్త పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ని అధిష్టానం నియమించింది. ఈనేపథ్యంలో హై కమాండ్‌పై మధు యాష్కీ గౌడ్ గుర్రుగా ఉన్నారు. వలస వచ్చిన నేతలకే పదవులు ఇస్తారా..? మొదటి నుండి పార్టీలో కష్టపడ్డ వారికి లేవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మధు యాష్కీ కామెంట్స్‌పై ఇప్పుడు పార్టీ తీవ్రంగా చర్చ జరుగుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో, అదేవిధంగా పార్టీని నుండి బీఆర్ఎస్‌లోకి జోరుగా వలసలు జరుగుతున్నా పార్టీ వెన్నంటే ఉన్నారు మధు యాష్కీ గౌడ్. రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, ప్రత్యేక తెలంగాణ కోసం హై కమాండ్ వద్ద తమ గళం వినిపించారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీపై తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ వచ్చారు.

అలాంటిది ఈ సారి ఖచ్చితంగా పీసీసి అధ్యక్ష పదవి మధు యాష్కీ గౌడ్‌కు దక్కుతుందని పార్టీలో ప్రచారం జరిగింది. అయితే చివరికి మహేష్ గౌడ్‌కు పీసీసీ చీఫ్ కట్టబెడుతూ హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పదవి కాలం జులై 27 న ముగియడంతో, ముఖ్యమంత్రిగా పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టాలి. కాబట్టి మరొకసారి తనకు పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టే ఉద్దేశం లేదని రేవంత్ రెడ్డి హై కమాండ్‌కు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త పీసీసీ అధ్యక్షుడు కోసం హై కమాండ్ సామాజిక సమీకరణాలతో కూడిన నివేదికను తెప్పించుకుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పీసీసీ అధ్యక్షుడిగా బీసీకి ఇవ్వాలని హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వలస పోయిన నేతలంతా ఒక్కొక్కరుగా సొంత గూటికి చేరుకుంటున్నారు. అలాగే ఎదో ఒక హామీతోనే పార్టీ కండువా కప్పుకుంటున్నారు. అయితే మొదటి నుండి కష్టపడ్డ తమకు ఎందుకు అవకాశం ఇవ్వట్లేదని మధు యాష్కీ హై కమాండ్‌ను గట్టిగానే ప్రశ్నిస్తున్నారు. తనకు బయటి పార్టీల నుండి ఎన్ని ఆఫర్లు వచ్చినా, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ కోసం పని చేసిన తనను హై కమాండ్ పక్కన బెట్టిందని మధు యాష్కీ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి పీసీసీ అధ్యక్ష పదవి దక్కపోవడంతో అధిష్టానంపై మధు యాష్కీ గౌడ్ గుర్రుగా ఉన్నాడట. ఈ వ్యవహారంపై మరొకసారి పార్టీలో తీవ్రంగా చర్చకు దారి తీస్తోంది. మరి హై కమాండ్ మధు యాష్కీ విషయంలో ఈ విధమైన నిర్ణయం తీసుకుంటుంది. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుందా అనేది చూడాలి..!

# అన్ స్టాపబుల్ హైడ్రా...

హైదరాబాద్: రోజురోజుకు విమర్శలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి అంతకన్నా పెరుగుతోంది. ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ అంతకన్నా ఎక్కువవుతుంది. మరి హైడ్రా కంటిన్యూ అవుతుందా ? ఇక అటకెక్కిస్తారా? అనేవే ప్రశ్నలు. వీటిపైనే తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో తెగ ప్రచారం జరుగుతోంది. మరి తర్వాత జరగబోయేది ఏంటి? శషభిషలు లేవు.. అంతా క్రిస్టల్ క్లియర్. బతిలాడినా.. వేడుకున్నా.. భయపెట్టినా.. బెదిరించినా.. తగ్గేదేలే.. వెనకడుగు వేసేదేలే. ఏ లక్ష్యంతో అయితే హైడ్రాను ప్రారంభించామో.. ఆ లక్ష్యం నెరవేరే వరకు ముందుకు సాగడమే తప్ప.. వెనకడుగు వేసేది లేదు. ఇందులో మీకు ఎలాంటి డౌట్స్ అవసరం లేదు. ఇలా ఉన్నది ఉన్నట్టు.. ముఖం మీద కొట్టినట్టు చెప్తేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. హైడ్రా ఇక నుంచి ముందుకే వెళ్తుంది తప్ప.. ఆగిపోవడం అనే ప్రశ్నే లేదంటున్నారు. కాస్త బాధగా.. మరికాస్త నష్టం చేకూర్చినా.. కొందరికి నష్టం జరిగినా.. హైడ్రా దూకుడుగా ఉండాల్సిందే. ఎందుకంటే హైడ్రా దూకుడుగా ఉంటేనే.. చెరువులను చెర పట్టిన వారి పీడ విరగడవుతుంది. భూములు ఫ్రీ అవుతాయి. వారి ప్రవాహానికి ఎలాంటి అడ్డు అదుపు ఉండదు. లేదంటే ఇప్పుడు జరుగుతున్న ఉపద్రవాలను చూస్తూనే ఉన్నాం కదా. ఇదే విషయాన్ని చెబుతున్నారు సీఎం రేవంత్. కొన్ని రోజులుగా ఓ చర్చ నడుస్తోంది. ఇక హైడ్రా పని అయిపోయింది.. దాన్ని మెల్లిమెల్లిగా నిర్వీర్యం చేస్తారని, కానీ వారి అనుమానాలన్నీ ఇప్పటికే పటాపంచలయ్యి ఉంటాయి. దీనికి కొనసాగింపుగా మరికొన్ని డిటెయిల్స్ రిలీజ్ చేసింది హైడ్రా. ఇప్పటి వరకు 23 ప్రాంతాల్లో ఆక్రమణలను కూల్చేశామని చెప్పింది హైడ్రా. అంతేకాదు.. మొత్తం 262 అక్రమ కట్టడాలను నేలమట్టం చేసి.. 111 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంది. కాబట్టి.. పని ఎక్కడా ఆగలేదు. అయితే రేవంత్ ఆలోచన హైడ్రాతో ఆగిందా? నిజానికి మూసీ నది సుందరీకరణపై అధికారంలోకి వచ్చినప్పుడే ఫోకస్ చేశారు సీఎం రేవంత్. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మూసీని డెవలప్ చేయాలనుకుంటున్నారు. ఇప్పటికే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు అదే విషయాన్ని మరోసారి గుర్తు చేస్తున్నారు రేవంత్. ఆక్రమణల విషయంలో జాలి, దయ అవసరం లేదంటున్నారు రేవంత్. ఎందుకంటే.. ఒక్కసారి కాంప్రమైజ్ అయితే అసలు లక్ష్యం నీరుగారిపోతుంది. అందుకే డైరెక్ట్‌గా హెచ్చరిస్తున్నారు. మీ అక్రమ నిర్మాణాలను మీరే కూల్చేయాలి. లేదంటే మేమే వచ్చి కూల్చేస్తామంటున్నారు. ఇది హైడ్రా విషయంలో ఇచ్చిన క్లారిటీ. ఇక మూసీ చుట్టుపక్కల ఉన్న నిర్మాణాల విషయంలో మాత్రం ఆయన కాస్త జాలి చూపించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో గుడిసెలు వేసుకున్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు. నిజానికి చాలా మంది మూసీ పరివాహక ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అందుకే వారి సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆక్రమణల విషయంలో అష్టదిగ్బంధనం చేస్తున్నారు సీఎం రేవంత్. ఆక్రమణలు కూల్చేస్తున్నారు. కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఇదే సమయంలో.. ఈ ఆక్రమణలకు వంతపాడిన వారి భరతం కూడా పడుతున్నారు. అంతేకాదు హైడ్రాను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. హైడ్రాకు ప్రత్యేకంగా పోలీస్ అధికారులను కేటాయించారు. 15 మంది సీఐ స్థాయి అధికారులు. 8 మంది ఎస్ఐ స్థాయి అధికారులు ఇప్పుడు హైడ్రా కోసం పనిచేయనున్నారు. కాబట్టి.. అన్‌స్టాపబుల్‌గా హైడ్రా ముందుకు వెళ్లడమే కానీ.. ఆగే సవాలే లేదు.

# విద్య రంగానికి కొండేల మారుతి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి

**-కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా**
**-మంత్రపురి విద్యా శ్రేష్ట మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ**

మంథని: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండేల మారుతి విద్యారంగానికి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా అన్నారు. శుక్రవారం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంత్రపురి విద్యా శ్రేష్ట మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతి విద్యారంగానికి చేస్తున్న కృషిని ఇదేవిధంగా కొనసాగిస్తూ మంథని నియోజక వర్గం లోపల విద్యాసంస్థలను బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమ వ్యవహర్త మంథని విద్యార్థి యువత అధ్యక్షుడు శ్రీ కొండల మారుతి మాట్లాడుతూ మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో నాతోపాటు కృషి చేసిన పెద్దలందరికీ సభాముఖంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని కళాశాలలో గల అధ్యాపకులు అందరినీ ప్రశంసా పత్రము, శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ సెక్రటరీ మాదాడి ప్రభాకర్ రెడ్డి, అతిథులుగా విచ్చేసిన రాధాకృష్ణయ్య ,నరసింహ చారి, ఐక్యుఏసి కోఆర్డినేటర్ కృష్ణ ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందము, మానస, రజిత, బోధ నేతర సిబ్బంది అశోక్, సుధాకర్, ముజాహిద్, రాజు, దుర్గారాజు ,సురేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**